

www.bharathasakthi.com

# భారత శక్తి

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN

Published from Kurnool, Vijayawada, Kadapa, Hyderabad,Guntur, Khammam, & Warangal



సంపుటి: 13 సంచిక: 50 కర్నూలు, గురువారం, 3 జూలై 2025 పేజీలు: 8 వెల: 1.00


## రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా

# కుప్పం: సీఎం చంద్రబాబు



కుప్పం: రైతుల పంపుసెట్లకు ఉచితంగా సౌర విద్యుత్ అందిస్తామని ఏపీ సీఎం చంద్రబాబు ( తెలిపారు. శాశ్వతంగా విద్యుత్ ఛార్జీలు చెల్లించే పనిలేకుండా ప్రతి ఇంట్లో సౌర విద్యుత్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో రూ.1292.74 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం తుమ్మిశిలో నిర్వహించిన 'ప్రజావేదిక' సభలో చంద్రబాబు మాట్లాడారు. కుప్పం రూపురేఖలు మార్చబోతున్నామన్నారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా నియోజకవర్గం నిలవబోతోందని చెప్పారు.

"అభివృద్ధి, సంక్షేమం రెండూ సమానంగా ఉండాలి. సంపద సృష్టించి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలి. కుప్పం ప్రజలు తొమ్మిదిసార్లు నన్ను ఎమ్మెల్యేగా ఆశీర్వదించారు. వైకాపా పాలనతో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. అది తలచుకుంటే భయమేస్తోంది. వ్యవస్థలను నాశనం చేశారు. గుంతలు లేని రోడ్లు చేస్తామని చెప్పాం.. పూర్తిచేశాం. కుప్పంలో రూ.1292.74కోట్లతో పనులు చేపట్టాం. రూ.3829 కోట్లతో హంద్రీనీవా ద్వారా చివరి ఆయకట్టుకు నీళ్లిస్తాం. 10 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి నియోజకవర్గంగా కుప్పం నిలిచేలా చర్యలు చేపడతాం. పీఎం సూర్యఘర్ కింద మూడు కిలో వాట్ల విద్యుత్ ఉత్పత్తికి బీసీలకు రూ.98 వేల రాయితీ ఇస్తాం. కుప్పం ప్రాంతానికి విమానాశ్రయం వస్తుంది. కుప్పం-హోసూరుకు సమాంతరంగా మరో రోడ్డు నిర్మాణం జరుగుతుంది. నియోజకవర్గానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు రానున్నాయి. కుప్పం విమానాశ్రయానికి భూములు ఇచ్చిన వారికి మెరుగైన ప్యాకేజీ ఇస్తాం. రూ.వెయ్యికోట్లతో పలమనేరు-కృష్ణగిరి మధ్య 4 వరుసల రోడ్డు నిర్మాణం చేపడతాం" అని చంద్రబాబు తెలిపారు.

యజ్ఞం చేయాలి.. రాక్షసులపై పోరాడాలి

"నేను హత్యా రాజకీయాలు, శవ రాజకీయాలు చేయను. యజ్ఞంలా అభివృద్ధి చేస్తుంటే రాక్షసుల్లా ఫలితాలు రాకుండా చేస్తున్నారు. ధర్మాన్ని కాపాడతా.. అభివృద్ధికి అడ్డం వస్తే ఎవరినీ వదిలిపెట్టను. యజ్ఞం చేయాలి.. రాక్షసులపై పోరాడాలి.. ఫలితాలను ప్రజలకు అందించాలి" అని చంద్రబాబు అన్నారు.



## ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా

# పీవీఎన్ మాధవ్ ఏకగ్రీవం

హైదరాబాద్, జూలై 2: ఏపీ బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు మోహన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు అధ్యక్షురాలిగా ఉన్న రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి నుంచి మాధవ్ బాధ్యతలు స్వీకరించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం మరోసారి విభజన గాయాలకు గురికాకుండా ఈ ప్రాంత సంస్కృతీ, సంప్రదాయాలు, భాష, వారసత్వంపై ప్రజలకు నాది అనే భావన పెరిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. పునర్విభజన చట్టంలో ఇంకా మిగిలిన సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

## గోదావరిలో పెరుగుతున్న నీటిమట్టం..

## పాపికొండల విహారయాత్ర తాత్కాలికంగా నిలిపివేత

దేవీపట్నం: అల్లూరి జిల్లాలోని దేవీపట్నం నుంచి పాపికొండల విహారయాత్రను జలవనరుల శాఖ తాత్కాలికంగా నిలిపివేసింది. వర్షంతో పాటు గోదావరిలో నీటిమట్టం పెరుగుతున్న కారణంగా అధికారులు ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు దేవీపట్నం మండలం దండంగి, డి.రావిలంక గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారిపై గోదావరి వరద ప్రవాహం పెరిగింది. దీంతో గండి పోచమ్మ ఆలయం వైపునకు రాకపోకలు నిలిచిపోయాయి.

%పోలవరం వద్ద పెరిగిన నీటిమట్టం


పోలవరం ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో పాటు నదీ పరివాహక ప్రాంతాల నుంచి నీరు భారీగా గోదావరిలోకి వచ్చి చేరుతోంది.



పోలవరం ప్రాజెక్ట్ స్పిల్‌వే వద్ద నీటిమట్టం 27.16 మీటర్లకు పెరిగింది.

## గోదావరిలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇసుక తవ్వకాలపై కొరడా

%రామచంద్రపురం: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని గోదావరిలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇసుక తవ్వకాలపై కలెక్టర్ మహేశ్‌కుమార్ కొరడా ఝుళిపించారు. రెవెన్యూ, పోలీసు, గనుల శాఖ అధికారులతో రేవుల్లో నిరంతర పర్యవేక్షణ చేపట్టారు. రామచంద్రపురం, కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాల్లో ఈ బృందాలు పరిశీలించాయి. ఇక్కడ ఇసుక తవ్వకాలు జరపకుండా ఆదేశాలు జారీ చేశారు. బాధ్యులైన సిబ్బందిపై చర్యలకు కలెక్టర్ రంగం సిద్ధం చేశారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. (



## ఉద్యోగానికి రాజీనామా చేసిన

# ఏపీ ఐపీఎస్ సిద్ధార్థ్ కౌశల్..!

ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సిద్ధార్థ్ కౌశల్ కీలక నిర్ణయం తీసుకున్నారు. తన ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వ్యక్తిగత కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆయన బుధవారం లేఖను విడుదల చేశారు. తన రాజీనామా విషయంలో ఎలాంటి బలవంతంగా, వేధింపులు లేవంటూ రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో రాజీనామా చేసినట్లుగా జరుగుతున్న ప్రచారమంతా అవాస్తవమన్నారు. ఏపీలో పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్న ఆయన.. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

ఉద్యోగ కాలంలో సహకరించిన ప్రభుత్వానికి, సహచరులకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఆయన కృష్ణా, ప్రకాశం, వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీగా సేవలందించారు. ప్రస్తుతం డీజీపీ కార్యాలయంలో ఎస్పీ (అడ్మిన్)గా పని చేస్తున్నారు. తన ఉద్యోగానికి రాజీనామా లేఖను ఏపీ డీజీపీ పంపినట్లు పేర్కొన్నారు. తాను ఐఐఎం స్టూడెంట్‌నని.. తనకు మంచి ఆఫర్ రావడంతో ఐపీఎస్ ఉద్యోగానికి స్వస్తి చెప్పినట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో చర్చించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఏపీ తన సొంత రాష్ట్రంగానే భావిస్తానన్నారు. అయితే, ఇటీవల ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న



వైఖరి కారణంగా సిద్ధార్థ్ కౌశల్ తన ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నారంటూ వార్తలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఆయన రాజీనామాపై స్పష్టత ఇచ్చారు.

## సముద్ర కోత నివారణ గోడల నిర్మాణం

## పరిశీలించిన అధికార బృందం

నర్సాపురం: మలేషియా, సింగపూర్ వంటి దేశాలలో సముద్ర కోత నివారణకు ఈ తరహా టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు . అదే టెక్నాలజీని నర్సాపురం మండలం పిఎం లంక వద్ద నిర్మిస్తున్న గోడ నిర్మాణ పనుల్లోనూ వినియోగిస్తున్న గార్వేర్ టెక్నాలజీ సంస్థ ఆర్వో రమేష్ శెట్టి చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం పి యం లంక వద్ద సముద్ర కోత నివారణకు ప్రముఖ కార్పొరేట్ సంస్థ డిలైట్ ఆర్థిక సహకారం రూ 13.50 కోట్లతో నిర్మిస్తున్న గోడ నిర్మాణ పనులను అధికారుల బృందం పరిశీలించారు. వారికి జరుగుతున్న పనులు వివరాలను గార్వేర్ సంస్థ ప్రతినిధులు వివరించారు. అనంతరం ఆ సంస్థ రీజినల్ మేనేజర్ రమేష్ శెట్టి మీడియాతో మాట్లాడుతూ తొలివిడతగా కిలోమీటర్ మేర సముద్ర కోత నివారణకు గోడ నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. పనులు పూర్తయితే చాలా వరకు గ్రామం వద్ద సముద్ర కోత నివారణ తగ్గుతుందన్నారు .డిసెంబర్ నాటికి ఈ పనులను పూర్తి చేస్తామని చెప్పారు.

## జగన్ అలా చేస్తే మా కొంపేమి

# మునగదు కదా: సోమిరెడ్డి

అమరావతి, జులై 2: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై సీనియర్ ఎమ్మెల్యే, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి (మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. వైసీపీ నేతల ఆలోచనలే దుర్మార్గమని మండిపడ్డారు. ఆ పార్టీ నేతలకు ఏమైందో తెలియడం లేదన్నారు. జగన్ పరామర్శల పేరుతో ప్రాణాలు తీస్తున్నారని ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.



'అప్పుడేమో భద్రత లేదన్నారు... ఇప్పుడు పోలీసులు అనుమతిచ్చినా కోర్టుకెళ్లారు. పరామర్శల పేరుతో ప్రదర్శనలు చేసి ప్రజల ప్రాణాలు తీస్తారు. దానికి పోలీసుల వైఫల్యమని నెపం పెడతారు. జాగ్రత్తలు తీసుకుంటుంటే రాజకీయం చేస్తారు. వైసీపీ నేతల ఆలోచనలే దుర్మార్గం. అసలు ఈ రప్పా రప్పా పార్టీ నాయకులకు ఏమైందో అర్థం కావడం లేదు. ఏదో కన్ఫ్యూజన్‌లో ఉన్నట్టు అనిపిస్తోంది. నెల్లూరులో జగన్ దిగడానికి హెలిప్యాడ్‌కు ముందుగానే అనుమతులు ఇచ్చినా హైకోర్టును ఆశ్రయించడం విచిత్రంగా ఉంది. రెంటపాళ్ల పర్యటనలో చోటు చేసుకున్న ఘటనల నేపథ్యంలో వైసీపీ నేతలు ఎంపిక చేసిన ప్రదేశాలకు ప్రత్యామ్నాయంగా జైలుకు దగ్గరలో అనుమతి ఇచ్చారు. ఏదో ఒక ఇష్యూ క్రియేట్ చేసి సానుభూతి పొందడానికే హైకోర్టుకు వెళ్లినట్టుగా ఉంది. జగన్ రెడ్డి హెలికాప్టర్‌లో దిగితే కూటమి ప్రభుత్వానికి కొంపేమి మునగదు కదా. బెట్టింగ్ రాయుడి పరామర్శకు రెంటపాళ్లకు వెళ్లి మూడు ప్రాణాలను బలితీసుకున్నారు. అక్కడ పోలీసులు భద్రత కల్పించలేదని విమర్శలు గుప్పించారు. ఇప్పుడు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటుంటే సానుభూతి కోసం కోర్టుకు వెళుతున్నారు. ప్రజల ప్రాణాలను రక్షించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని గుర్తుంచుకోండి. ఓ వైపు వాతావరణం అనుకూలంగా లేదని పర్యటన వాయిదా వేసుకుని మరోవైపు హైకోర్టును ఆశ్రయించడం విడ్డూరంగా ఉంది' అంటూ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ట్వీట్ చేశారు.

భారత శక్తి
VOICE OF INDIAN

# ఆర్థిక గతిని మార్చేసిన జీఎస్టీ

వస్తు, సేవల పన్ను భారత దేశపు పన్ను సంస్కరణల చరిత్రలో ఒక విప్లవాత్మక మలుపు. ఎనిమిదేళ్ల తరువాత 2025లో జీఎస్టీ విధానం దేశ చరిత్రలో అత్యంత ముఖ్యమైన పన్ను సంస్కరణల్లో ఒకటిగా నిలుస్తోందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక వ్యవస్థను క్రమబద్ధీకరించడం, పారదర్శకతను పెంచడం, వృద్ధిని పెంపొందించేందుకు విలువ ఆధారిత పన్నులు(వ్యాట్) స్థానంలో జీఎస్టీని ప్రవేశపెడుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అప్పటి నుంచి నేటి వరకు జీఎస్టీ సాధించిన కొన్ని విజయాల గురించి తెలుసుకుందాం. ఒకే దేశం, ఒకే పన్ను. జీఎస్టీ అమలు ద్వారా 17 వేర్వేరు పన్నులు, 13 సెస్‌లను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చారు. దాంతో గతంలో రాష్ట్రాల్లో ఉన్న పరోక్ష పన్నుల భారం తొలగిపోయింది. ఈ సమన్వయం ఒక ఉమ్మడి జాతీయ విధానాన్ని సృష్టించింది. లాజిస్టిక్స్ ఖర్చులను గణనీయంగా తగ్గించింది. రాష్ట్రాల మధ్య వాణిజ్యాన్ని సులభతరం చేసింది. ప్రతి సంవత్సరం జులై మొదటి తేదీని వస్తు సేవల పన్ను దినోత్సవంగా దేశంలో పాటిస్తున్నారు. ఇది కేవలం ఒక పన్ను విధానం ఆవిర్భావ దినోత్సవం మాత్రమే కాదు, భారతదేశ ఆర్థిక వ్యవస్థకు ఓ సుస్థిర మార్గాన్ని ఏర్పరిచిన ఘట్టం. దేశవ్యాప్తంగా పన్నుల పరంగా అనేక మోడళ్ల మధ్య జరుగుతున్న గందరగోళానికి ముగింపు పలికిన మలుపు. వస్తు సేవల పన్ను అమలుకు దారితీసిన అవసరాలు ఎన్నో. కొంతకాలం క్రితమే మన దేశంలో విక్రయపు పన్ను, ఎక్సైజ్ సుంకం, సేవలపై పన్ను, రాష్ట్రాల మధ్య వ్యాపార లావాదేవీలపై వేర్వేరు పన్నులు, ప్రవేశపు పన్ను వంటి అనేక రకాల పన్నులు అమలులో ఉండేవి. రాష్ట్రానికి ఒక విధానం, మరో రాష్ట్రానికి మరో విధానంతో వ్యాపార రంగం సంక్లిష్టతలతో కొట్టుమిట్టాడేది. దేశ వ్యాప్తంగా సమగ్ర వ్యాపార వాతావరణం ఏర్పడలేకపోయింది. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారంగా ఒకే విధమైన పన్ను విధానాన్ని రూపొందించారు. దీని ఫలితంగా దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం అమలులోకి వచ్చింది. దీనివల్ల పన్నుల వ్యవస్థసరళతరం అయింది. వ్యాపారులు పన్నుల వివరాలు సమర్పించడంలో నూతన సాంకేతిక పద్ధతులను ఉపయోగించటం ప్రారంభించారు. ఈ పన్ను విధానం మూడు భాగాలుగా విభజించబడింది. తయారీదారునుండి తుది వినియోగదారుని వరకు ప్రతి దశలో విధించబడే పన్నును తక్షణమే ముందుగానే చెల్లించిన పన్నుతో సమన్వయం చేసుకునే అవకాశం కల్పించబడింది. దాని వల్ల ఒకే వస్తువుపై పన్ను మీద పన్ను విధించే పరిస్థితి లేకుండాపోయింది. ఈ విధానంలో కేంద్రానికి ఒక భాగం, రాష్ట్రానికి మరో భాగం లభించేలా పన్ను వసూలు జరుగుతుంది. అంతర్రాష్ట్ర వ్యాపార లావాదేవీలపై ప్రత్యేకంగా మరో విధానంలో వసూలు జరుగుతుంది. దీనివల్ల రాష్ట్రాల మధ్య వస్తువుల రవాణా సులభతరమైంది. వాణిజ్యానికి ఆటంకాలు తొలగిపోయాయి. ప్రస్తుతం ఈ పన్ను విధానం నాలుగు ప్రధాన శ్రేణులుగా విభజించ బడింది. అవసరమైన నిత్యావసర వస్తువులకు తక్కువ శాతం, విలాస వస్తువులకు ఎక్కువ శాతం విధించబడుతున్నాయి. దీనివల్ల సామాన్యులపై భారం తగ్గించబడి, విలాస వస్తువుల వినియోగంపై నియంత్రణ సాధించబడుతోంది. ఈ పన్ను విధానం ప్రారంభం తరువాత ప్రభుత్వ ఆదాయ వనరులు గణనీయంగా పెరిగాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో పన్ను ద్వారా వచ్చిన ఆదాయం 22.08 లక్షల కోట్ల రూపాయలకుపైగా ఉండటం గమనించదగినది. ఇది పాలనా సామర్థ్యాన్ని సూచించడమే కాదు, పన్ను చెల్లింపులో పారదర్శకతను, ప్రజల నమ్మకాన్ని ప్రతిబింబిస్తోంది. అయితే, దీనిలో కొన్ని సవాళ్లు ఇప్పటికీ ఎదురవుతున్నాయి. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా వ్యాపారులు ఈ పద్ధతిలో పూర్తిగా స్థిరపడలేకపోతున్నారు. పన్ను వేదికపై సాంకేతిక సమస్యలు, ఖాతాల సర్దుబాటు లోపాలు, ఎంటరైన పన్ను మొత్తాన్ని తిరిగి వాడుకునే అవకాశాలపై చిక్కులు, తరచూ మారే నిబంధనలు వీటన్నీ వ్యవస్థపై కొంత అస్పష్టత కలిగిస్తున్నాయి. వస్తు సేవల పన్ను దినోత్సవం అనేది ఈ విధానంపై ప్రజలలో అవగాహన పెంపు, ప్రయోజనాలపై చర్చలు, విధాన బలాలపై మద్దతు, లోపాలపై పరిష్కారాలకు మార్గదర్శనం చేసే సందర్భంగా పరిగణించాలి. కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్రాలు, పరిశ్రమల సంఘాలు, వాణిజ్య మండలాలు ఈ దినాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాలు, సదస్సులు, వర్క్‌షాపులు నిర్వహించడం ప్రాశస్త్యం. ఈ విధానం ద్వారా దేశీయ పెట్టుబడులే కాకుండా, విదేశీ పెట్టుబడులకు కూడా అనుకూల వాతావరణం ఏర్పడింది. వ్యాపారానికి అనువైన విధానంగా దీన్ని అంతర్జాతీయంగా గుర్తిస్తున్నారు. మొత్తంగా ఇది కేవలం పన్ను విధానం కాదని, దేశఆర్థిక సమీకరణకు ఒక నూతన దిశనిచ్చిన మార్గదర్శకంగా నిలుస్తున్నది. పన్ను చెల్లింపు దారులు, వ్యాపారులు, పాలకులు, ప్రజలందరూ ఈ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చుకోవాలన్న సంకల్పంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పన్నుల వ్యవస్థను నడిపించేలా జీఎస్టీ కౌన్సిల్ ఇప్పటి వరకు 55కి పైగా సమావేశాలు నిర్వహించింది. ఉమ్మడి నిర్ణయాలు తీసుకోవడానికి ఈ వేదిక సహకారాన్ని పెంపొందించడమే కాకుండా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక అవసరాలను తీర్చేలా వీలు కల్పించింది. జీఎస్టీ పన్ను వ్యవస్థలో పెనుమార్పులు తీసుకువచ్చినప్పటికీ రేట్ల సరళీకరణ, కాంప్లయన్స్ లోపాలను పరిష్కరించడం, ఐటీ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం వంటి సవాళ్లు కొనసాగుతున్నాయి. అయినప్పటికీ, ఈ వ్యవస్థ మరింత సమర్థవంతమైన, ఏకీకృత, పారదర్శక పన్ను విధానానికి పునాది వేస్తుంది

# ఫ్రీ బస్సు కోసం పక్కా ప్లాన్

విజయవాడ, జూలై 1

ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకంలోని మరో పథకం అమలుకు కూటమి ప్రభుత్వం తుది కసరత్తు చేస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ఈ ఏడాది ఆగస్ట్ 15 నుంచి కల్పించనున్నారు. పథకం అమలుతో పెరిగే ఆక్యుపెన్సీకి తగ్గట్టు బస్సులు సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఇందుకు కొత్త బస్సులు కొనడం గానీ, అవసరమైతే అద్దెకు తీసుకోవడం గానీ చేయాలన్నారు. ఇకపై ఆర్టీసీలో ప్రవేశపెట్టేవన్నీ ఈవీ ఏసీ బస్సులే ఉండాలని? ఇప్పుడున్న బస్సులను కూడా ఈవీలుగా మార్చేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని చెప్పారు. అలాగే, ప్రతీ బస్సుకు జీపీఎస్ తప్పనిసరిగా అమర్చాలని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు. ఆర్థిక కష్టాలను అధిగమించాలంటే ఆర్టీసీ ఆదాయ మార్గాలను పెంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఖర్చు ఎలా తగ్గించుకోవాలి... ఇతర మార్గాల ద్వారా ఆదాయాలను ఎలా పొందాలి అనే దానిపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా సమర్థత పెంచుకోవాలని చెప్పారు. బస్ కాంప్లెక్స్‌లో టాయిలెట్లు పరిశుభ్రంగా ఉంచడం దగ్గర నుంచి బస్సు ప్రయాణం వరకు ప్రయాణికుల్లో సంతృప్తి పెరిగేలా నిర్వహణ ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.'బ్యాటరీ స్వాపింగ్ విధానంతో ఆర్టీసీ బస్సుల నిర్వహణ వ్యయం తగ్గే అంశాన్ని పరిశీలించాలి. డీజిల్, ఈవీ, సీఎన్జీ, బ్యాటరీ స్వైపింగ్... ఇలా ఏ బస్సు కొనుగోలు, నిర్వహణకు ఎంత వ్యయం అవుతుందనే ప్రతిపాదనలు రూపొందించండి. బ్యాటరీ, బ్యాటరీ లేకుండా, సర్వీస్ స్టేషన్లను ప్రైవేట్ సంస్థలు నిర్వహించడం, బస్సులను ఆపరేట్ చేయడం... ఇలా ఏ విధానంతో వ్యయం తగ్గుతుందనేది పరిశీలించండి" అని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కొత్త పథకం అమలుకు అదనంగా మరో 2,536 బస్సులు అవసరమని అధికారులు లెక్కలు తేల్చారు. దీనికి రూ.996 కోట్లు వ్యయం కానుందని భావిస్తున్నారు. అలాగే బస్ స్టేషన్లో తాగునీటి సౌకర్యం, టాయిలెట్ల నిర్వహణ, బస్సుల సమాచార బోర్డులు, ఇతర సౌకర్యాలను మెరుగుపరచాల్సి ఉందిని సీఎంకు అధికారులు వివరించారు. రాష్ట్రంలో మొత్తం జనాభా 5.25 కోట్లు ఉంటే అందులో మహిళలు 2.62 కోట్లు ఉన్నారు. వీరిలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ బస్సుల్లో మహిళల ప్రయాణాల సంఖ్య ప్రస్తుతం ఏడాదికి 43.06 కోట్లుగా ఉంది. ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేసిన తర్వాత ఇది 75.51 కోట్లకు పెరగొచ్చని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రతి మహిళ సగటున వారానికి ఒకసారి అయినా ప్రయాణిస్తుంటారని తెలిపారు. ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రస్తుతం మహిళల ప్రయాణాల సంఖ్య 6.85 కోట్లుగా ఉంది. పథకం అమలు తర్వాత ఈ సంఖ్య 13.39 కోట్లకు పెరగొచ్చు.

మొత్తమ్మీద ఉచిత బస్సు పథకంతో మహిళలు ఏడాదిలో 88.90 కోట్ల సార్లు ప్రయాణించే వీలుంది. ప్రస్తుతం ఢిల్లీ, పంజాబ్, తమిళనాడు, కర్నాటక, తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు రవాణా




సౌకర్యం కల్పిస్తున్నాయి. అయితే ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధానాన్ని అనుసరిస్తున్నారు. మన రాష్ట్రంలో ప్రవేశ పెట్టే విధానం అత్యుత్తమంగా, సంతృప్తి కలిగేలా... ఉండాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. మొత్తం బస్సుల్లో 57 శాతం పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ బస్సులు ఉన్నాయి. గత ఏడాదిలో ఇవి 67.76 కోట్ల కిలో మీటర్ల దూరం ప్రయాణించాయి. అలాగే ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు మరో 17 శాతం ఉన్నాయి. రాష్ట్రంలో పెద్ద నగరాలు లేకున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ రాయడంతో కేంద్రం రాష్ట్రానికి బస్సులు కేటాయించింది. రాష్ట్రంలో 11 మున్సిపల్ కార్పొరేషన్లకు 750 ఈవీ బస్సులను కేంద్ర ప్రభుత్వం అర్బన్ ట్రాన్స్‌పోర్టు కింద అందిస్తోంది.

# రైతుల్లో నిరాశ... నిస్పృహ..

ఏలూరు, రాజమండ్రి, జూలై 12

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా, రైతులకు ఇచ్చిన హామీలు ఇంకా కాగితాల్లోనే మిగిలిపోవడంతో ఆంధ్రప్రదేశ్లో రైతాంగం తీవ్ర నిరాశ, నిట్టూర్పులతో అలమటిస్తోంది! వ్యవసాయ రంగంపై నిర్లక్ష్యాన్ని బట్టి చంద్రబాబు మునుపటి వైఖరి మారలేదనే స్పష్టమౌతోంది. కూటమిలో తెలుగుదేశంతో పాటు జనసేన, బీజేపీలు చేరి ఇచ్చిన ఎన్నికల ఉమ్మడి హామీల అమలుకూ రైతాంగం నోచుకోవడం లేదు. హామీల మేరకైనా వ్యవసాయ సమస్యల్ని తీర్చి చరిత్ర గతిని మారుస్తారా? ఇదే నిర్లక్ష్యం కొనసాగించి చరిత్రహీనులుగా మిగులుతారా? అని ఏపీ రైతాంగం ప్రశ్నిస్తోంది. సూపర్ సిక్స్‌లో భాగంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు గొప్పగా చెప్పిన హామీలు రైతులకు గుర్తున్నాయి. ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20,000 పెట్టుబడి సాయం ఇస్తామని "అన్నదాత సుఖీభవ" పథకాన్ని కూటమి పార్టీలు మేనిఫెస్టోలో పెట్టాయి. కానీ, ఏడాది గడిచినా ఈ హామీ నెరవేరలేదు. రైతుల ఖాతాల్లో ఒక్క రూపాయి కూడా జమ కాలేదు. ఏడాదిలో 143 హామీలు నెరవేర్చామని కూటమి నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారు, కానీ రైతులకు సంబంధించిన హామీలు ఎన్ని నెరవేరాయి? అనే ప్రశ్నకు సమాధానం.. సున్నా! "మీరు ఇచ్చిన మాట ప్రకారం రూ.20,000 ఎప్పుడు ఇస్తారు?" అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రతి గ్రామంలో రైతులు ఈ హామీని గుర్తు చేస్తూ, తమ ఖాతాల్లో డబ్బు జమ చేయాలని కోరుతున్నారుకేవలం ధాన్యం సేకరణ విషయంలో మాత్రం కూటమి ప్రభుత్వం పట్ల రైతులు సంతృప్తిగా ఉన్నారు. పీపుల్స్ పల్స్ సర్వేలో రైతులు చెప్పినట్లు, ధాన్యం సేకరణ తర్వాత నగదు చెల్లింపులు వెంటనే జరుగుతున్నాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం 55,57,525 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. 8,50,342 మంది రైతులకు రూ.13,584 కోట్ల చెల్లింపులతో పాటు, గత ప్రభుత్వం బకాయి పడిన రూ.1674 కోట్లు కూడా చెల్లించింది. ఈ విషయంలో రైతులకు ఎలాంటి ఫిర్యాదూ లేదు. కానీ, రైతుల సమస్యలు కేవలం ధాన్యం సేకరణతోనే ముగిసిపోతాయా అనే ప్రశ్న సర్వత్రా వినిపిస్తోంది. పెట్టుబడి సాయం, గిట్టుబాటు ధర, నీటి సౌకర్యం, ఉచిత బీమా, అన్నదాత సుఖీభవ ఎప్పుడని వారడుగుతున్నారు. 'సూపర్ సిక్స్' పేరిట రైతులకు ఇచ్చిన హామీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు, పాడి రైతులకు రూ.2 లక్షల సబ్సిడీతో షెడ్డుల నిర్మాణం వంటివి చేస్తామని కూటమి పార్టీలు ఎన్నికల్లో ప్రకటించాయి. ఇప్పుడు అవి అమలవుతున్నాయని రాష్ట్రంలో ఏ ఒక్క రైతూ చెప్పలేదు. 60 లక్షలకు పైగా ఉన్న పాడి రైతులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా కూటమి నెరవేర్చలేదు. "మాకు షెడ్డులు ఎక్కడ? డ్రిప్ పరికరాలు ఎక్కడ?" అని రైతులు ప్రశ్నిస్తున్నారు. కాగితాలకే తప్ప ఇవేవీ గ్రామాలకు చేరలేదని స్పష్టమవుతోంది. అటు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడికి కూడా రైతుల కంటే కంప్యూటర్లు, కంపెనీలే ముఖ్యమని అధిక శాతం రైతులు అభిప్రాయపడ్డారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎన్నికల ముందు కౌలు రైతుల సమస్యలపై గళమెత్తారు. కానీ, అధికారంలోకి వచ్చాక కౌలు రైతుల గురించి మాట్లాడటం మానేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. "పవన్ కళ్యాణ్ సినిమాల గురించి, సనాతన ధర్మం గురించి మాట్లాడుతున్నారు, కానీ రైతుల గురించి ఒక్క మాటా లేదు!" అని ఆకువీడులో ఓ రైతు అన్నాడు. "కౌలు రైతుల కోసం పవన్ ఏం చేశాడు?" అని సత్తెనపల్లిలో జనసేన సానుభూతిపరుడైన శ్రీనివాన్ అనే రైతు ప్రశ్నించాడు. కమ్యూనిస్టు పార్టీలు, కాంగ్రెస్ అప్పుడప్పుడూ రైతుల సమస్యలపై మాట్లాడినా, అవి అరణ్య రోదనలుగా మిగిలిపోతున్నాయి. ఉద్యమ తరహాలో కార్యక్రమాలు లేవు. " కమ్యూనిస్టు అనుబంధ రైతు సంఘాలు రైతు సమస్యలపై మాట్లాడుతున్నా... వారి బలం సరిపోవడం లేదు. వారు లేవనెత్తిన అంశాలు వినే నాథుడే లేరు!" అని కమ్యూనిస్టు రైతు సంఘ నాయకుడు జమలయ్య చెప్పారు. ఏడాది కాలంగా, ఖరీఫ్, రబీ సీజన్లలో కరువు, తుఫాన్లతో నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వకుండా చేతులు దులుపుకుంది. ఉచిత పంట బీమా పథకాన్ని కూడా ఎత్తివేయడంతో రైతులకు నష్టపరిహారం అందకుండా పోయింది. పెసర, శెనగ, మినుములు, కంది వంటి పంటలకు పెట్టిన పెట్టుబడి వెనక్కి రాక, రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం పెసరకు రూ.8682, మినుములకు రూ.7400, ఎర్ర శెనగలకు రూ.5440 మద్దతు ధరలు ప్రకటించినా అవి రైతులకు అందడం లేదని పరిశీలనలో వెల్లడయ్యింది. వ్యాపారులు, దళారులు కనీసం రూ.1500 తక్కువకు కొంటున్నారని రైతులు ఆందోళనగా చెబుతున్నారు. కనీస మద్దతు ధర అమలు చేయించే వ్యవస్థే లేదు. ప్రభుత్వానికి ఇది పట్టడం లేదు. కౌలు రైతుల కోసం ఎన్నికల ముందు కూటమి అనేక హామీలు ఇచ్చింది. కొత్త కౌలు చట్టం తెస్తామని, గుర్తింపు కార్డులు ఇస్తామని చెప్పారు. కానీ, రాష్ట్రంలో 40 లక్షల మంది కౌలు రైతుల్లో లక్ష మందికి కూడా గుర్తింపు కార్డులు ఇవ్వలేదు. ఈ గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడం వల్ల పంట బీమా వారికి వర్తించడం లేదు. బ్యాంకులో రుణాలు పొందడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. "కౌలు రైతుల సమస్యలు పట్టించుకునే నాయకుడు ఎవరూ లేరు!" అని సత్తెనపల్లిలో కాపు సామాజిక వర్గానికి చెందిన రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమను విత్తన రాజధానిగా, హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని కూటమి హామీ ఇచ్చింది. కానీ, రైతుల భూములను సోలార్, గ్రీన్ ఎనర్జీ కంపెనీలకు అప్పగిస్తున్నారని ఈ ప్రాంత రైతులు ఆరోపిస్తున్నారు. కోత మామిడి కిలో రూ.5 కే అమ్మకాలు జరుగుతున్నాయి. మామిడి గుజ్జు పరిశ్రమలు రూ.12 హామీ ఇచ్చినా అమలు చేయడం లేదని నూజివీడులో కోటేశ్వరరావు అనే రైతు చెప్పారు. ఆక్వా రైతులకు విద్యుత్ యూనిట్కు రూ.1.50, ట్రాన్స్ఫార్మర్ ధర తగ్గింపు హామీలు కూడా నెరవేరలేదు. అంతర్జాతీయ మార్కెట్లో రొయ్యల ధర రూ.1,050 వరకు పలుకుతుంటే, కంపెనీలు రూ.500 కంటే తక్కువకు కొంటున్నాయని రవి అనే ఆక్వా రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాదిన పంజాబ్ రైతులు ఉద్యమించేవరకు ఇక్కడి ప్రభుత్వం పట్టించుకోదని వామపక్ష సానుభూతి పరుడైన ఈ రైతు చెప్పారు.

# జగన్ పాదయాత్ర 2.0

విజయవాడ, జూలై 2, (

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరిగి ఏడాది పూర్తయింది. టీడీపీ-జనసేన-బీజేపీ ఘన విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. చంద్రబాబునాయుడు సీఎం అయ్యారు. జనసే అధినేత పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం అయ్యారు. 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్న వైసీపీ ఈ ఎన్నికల్లో కేవలం



11 సీట్లకు పరిమితమైంది. ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. ఈ క్రమంలో కూటమి సర్కార్ ఏడాది పాలన తర్వాత వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. మరోసారి జనంలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. యువనేతల సమావేశంలో తన నిర్ణయం ప్రకటించారు. జగన్ 2017-19 మధ్య చేసిన 'ప్రజా సంకల్పయాత్ర' ఆయనకు రాజకీయంగా గణనీయమైన విజయాన్ని అందించింది. ప్రజల మధ్య ఉండడం, వారి సమస్యలను ఆలకించడం ద్వారా ఆయన వైసీపీని అధికారంలోకి తీసుకొచ్చారు. రాబోయే ఎన్నికల ముందు కూడా అదే ఆయుధం ఎక్కుపెట్టాలని జగన్ భావిస్తున్నారు. ఇది జగన్ 'మాస్ కనెక్ట్' వ్యూహాన్ని సూచిస్తుంది. ఈ పాదయాత్ర ద్వారా, ప్రజలతో భావోద్వేగ సంబంధాన్ని బలోపేతం చేయడంతోపాటు, ప్రతిపక్ష హయాంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను హైలైట్ చేయాలని జగన్ లక్ష్యంగా పెట్టుకున్నారు. జగన్ తన ప్రకటనలో సోషల్ మీడియా శక్తిని గుర్తించారు, దాన్ని 'ఫోన్ ఆయుధం'గా పేర్కొన్నారు. ఈ రోజుల్లో సోషల్ మీడియా రాజకీయ ప్రచారంలో కీలక పాత్ర పోషిస్తోంది. వైసీపీ సోషల్ మీడియా విభాగాన్ని బలోపేతం చేయాలని, అన్యాయాలను తక్షణం సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని జగన్ సూచించారు, ఆధునిక రాజకీయ వ్యూహంలో డిజిటల్ వేదికల ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. ఈ వ్యూహం ద్వారా యువ ఓటర్లను, సోషల్ మీడియా యాక్టివిస్టులను ఆకర్షించి, పార్టీ సందేశాన్ని వేగంగా, విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని జగన్ భావిస్తున్నారు. జగన్ యువ నేతలతో సమావేశంలో ఈ ప్రకటన చేయడం కేవలం పాదయాత్ర గురించి మాత్రమే కాదు, పార్టీ భవిష్యత్ నాయకత్వాన్ని సిద్ధం చేయడంలో కూడా భాగమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. యువ నేతలను ఉత్సాహపరచడం, వారిని సోషల్ మీడియా యాక్టివిస్టులుగా మార్చడం ద్వారా, జగన్ రాజకీయంగా చురుకైన, డిజిటల్ యుగానికి అనుగుణమైన నాయకత్వాన్ని తయారు చేస్తున్నారు. ఈ వ్యూహం ద్వారా యువతలో వైసీపీ ఆకర్షణను పెంచడంతోపాటు, ఎన్నికల్లో కీలక ఓటరు వర్గాన్ని లక్ష్యం వ్యూహంగా పేర్కొంటున్నారు.

# సింగారెడ్డి స్కూలు హెడ్ మాస్టర్ రిటైర్మెంట్ ఘటనంగా వీడ్కోలు పలికిన విద్యార్థులు, గ్రామస్థులు

ఖమ్మం

ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన హరి శ్రీనివాస్ నేలకొండపల్లిలో సింగారెడ్డి ప్రాథమిక పాఠశాలలో గత 12 సంవత్సరాలుగా పాఠశాల హెడ్మాస్టర్ గా పనిచేస్తున్నారు. పాఠశాలను అన్ని రంగాల్లో మేటీగా నిలిపి పాఠశాలకు రాష్ట్రస్థాయిలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారు. తాను చదివిన పాఠశాలకే ప్రధాన ఉపాధ్యాయుడిగా వచ్చారు. నాటి నుంచి పాఠశాల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేశారు. ఉపాధ్యాయులకు మార్గనిర్దేశం చేస్తూ విద్యార్థులతో మమేకమై వారి అభివృద్ధికి తోడ్పాటు

అందించారు. తమకు నచ్చిన ప్రధాన ఉపాధ్యాయుడు పదవి విరమణ చేపడుతున్న సందర్భంలో ఘనంగా వీడ్కోలు పలకాలని విద్యార్థులు నిర్ణయించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు కలసి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులతో పాటు ఆయన సతీమణి పై పూలు చల్లుతూ, కోలాటం ఆడుతూ, డబ్బు వాయిద్యాల మధ్య ఉపాధ్యాయిని ఇంటి నుంచి కిలోమీటర్ దూరం ఉన్న పాఠశాలకు తీసుకువెళ్లారు. స్వయంగా విద్యార్థులే కోలాటం ఆడుతూ స్వాగతం పలుకుతూ పాఠశాల వద్దకు తీసుకువెళ్లి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మాధవా...మార్పు కనిపించేనా

విశాఖపట్టణం, జూలై 2

భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడిగా పీవీఎన్వీ మాధవ్ ను నాయకత్వం ఎంపిక చేసింది. అయితే ఎవరికి వారు మాధవ్ మావాడే అంటూ ఓన్ చేసుకనే ప్రయత్నం చేస్తున్నారు. సోషల్ మీడియాలో టీడీపీ సానుభూతి పరులు చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు మాధవ్ అని కథనాలు వండి వారుస్తుంటే, మరొకవైపు వైసీపీ కూడా చంద్రబాబు వ్యతిరేక వర్గంలో మాత్రమే కాకుండా, జగన్ కు అనుకూలంగా మాధవ్ ఉంటారని లెక్కలు వేస్తున్నారు. ఇంతకూ మాధవ్ ఎంపిక ఎలా జరిగిందన్న దానిపై అనేక మంది రాజకీయ ఔత్సాహికులు ఆరా తీస్తున్నారు. పార్టీ అధినాయకత్వం మాత్రం మాధవ్ అందరి వాడు అని చెప్పి అధ్యక్ష పదవికి ఎంపిక చేసినట్లు కనపడుతుంది... ఆంధ్రప్రదేశ్ బీజేపీలో రెండు వర్గాలు ఉన్న మాట ఎవరూ కాదనలేరు. ఒకటి చంద్రబాబు అనుకూల వర్గం కాగా, మరొకటి జగన్ కు పరోక్షంగా మద్దతిచ్చే వర్గం. ఈ రెండు వర్గాలను కలుపుకుని వెళ్లేలా మాధవ్ ను ఎంపిక చేశారంటారు. మాధవ్ ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న నేత కావడంతో పాటు పార్టీకి లాయల్ గా ఉండటం కూడా అదనపు బలం అవుతుందని పార్టీ నమ్మింది. రెండు వర్గాలను సమంగా చేరదీసి పార్టీని ముందుకు నడిపే వ్యక్తి కోసం నాయకత్వం ఎంపిక చేసిందంటున్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు పగ్గాలు అప్పగిస్తే వారు ఒకవైపు మొగ్గు చూపే అవకాశముందని భావించిన పార్టీ నాయకత్వం తెలివిగా మాధవ్ ను ముందు పెట్టి కథను నడిపించాలని డిసైడ్ అయింది. మాధవ్ ఎవరికి అనుకూలం కాదు. అలాగే ఎవరికీ వ్యతిరేకం కాదు. పార్టీ సిద్ధాంతాలను, కేంద్ర నాయకత్వం ఆదేశాలను అమలు చేసేందుకు ఆయన ప్రయత్నిస్తారంటున్నారు. తొలి నుంచి మాధవ్ ఫ్యామిలీ చరిత్ర పరిశీలించినా ఐదు దశాబ్దాల నుంచి ఆ కుటుంబం బీజేపీలోనే ఉంది. పార్టీ గట్టు దాటి బయటకు అడుగు మోపే వ్యక్తి కాదు. అలాగే యువకుడు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు అందరినీ మెప్పించి, ఒప్పించి రాజకీయంగా పార్టీలో సమస్యలు తలెత్తినా ఢిల్లీ వైపు చూడకుండా చేయడంలో దిట్ట అని పార్టీ కేంద్ర నాయకత్వం నమ్మింది. అందుకే మాధవ్ ఎంపిక జరిగిందన్నది పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలిసింది. మరి మాధవ్ నాయకత్వంలో బీజేపీ ఏ విధంగా ముందుకు వెళుతున్నది చూడాల్సి ఉంది.

# ఘనంగా పెంపుడు కుక్క " ఘన " బర్త్ డే వేడుకలు

జంతువులను ప్రేమించడమే కాకుండా తమ కుటుంబంలో ఒకరిగా చేర్చుకొని మొదటి జన్మదిన వేడుకలు మెదక్ జిల్లా తూప్రాన్ లో ఘనంగా నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నేటి సమాజంలో ఒకరికి ఒకరు తోడు నీడగా ప్రేమమయా జీవితం గడిపే రోజులు అంతరించిపోతున్న సమయంలో ఏకంగా తమ పెంపుడు కుక్క కు "ఘనా" అని నామకరణం చేయడమే గాకుండా దాని ఆలనా పాలన చూస్తూ ఏడాది నిండిన కారణంగా ఘనా యజమాని తూప్రాన్ కు చెందిన గూడూరి శేఖర్ గౌడ్, శిరీషలు దంపతులు జులై 1నాడు వారి దగ్గరి బంధుమిత్రులను ఆహ్వానించి మొదటి సంవత్సర జన్మదిన వేడుకలు ఘనా కు నూతన వస్త్రాలు ధరించి, కళ్ళజోడు పెట్టీ బర్త్ డే కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పెంపుడు జంతువు అయిన ఘనా ను తమ పిల్లలతో సమానంగా పెంచి పోషిస్తున్నామని పేర్కొన్నారు. ఏ లోటు రాకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పించి స్నాన పానాదులు, బోజన సదుపాయాలు కల్పించి ఉత్తమ శిక్షణ అందించి జన్మదినం సందర్భంగా గూడూరి శేఖర్ గౌడ్, శిరీష లు ఆశీర్వదించి దీవించామన్నారు.

# చంద్రబాబు కొత్త ఒరవడి

రాజమండ్రి, జూలై 2,



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. నాలుగోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. పాలనలో తనదైన ముద్ర వేసుకున్నారు. విజనరీ నాయకుడుగా, టెక్నాలజీ సీఎంగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ప్రజలతో మమేకమవుతూ జనాదరణ పొందుతున్నారు. ఏడాది పాలనలో ప్రతీనెల ఒక జిల్లా లేదా ప్రాంతంలో పర్యటించి పింఛన్ల పంపిణీ కార్యక్రమం ద్వారా ప్రజలతో మమేకమవుతున్నారు.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గతంలో పరిపాలనపై ఎక్కువ దృష్టి పెట్టి, ప్రజా సంబంధాలను కొంతవరకు నిర్లక్ష్యం చేస్తారనే విమర్శలను ఎదుర్కొన్నారు. అయితే, 2024 జూన్‌లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత, ఈ విమర్శలను పటాపంచలు చేస్తూ, ప్రజలతో నేరుగా సంబంధం బలోపేతం చేసుకుంటున్నారు. ప్రతినెలా 1వ తేదీన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటూ, గత 12 నెలలుగా అత్యంత చురుకైన ప్రజా సంబంధాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఆయన గ్రామీణ స్థాయిలో ప్రజల సమస్యలను స్వయంగా అర్థం చేసుకుంటూ, పాలనను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు.2024 జూలై 1 నుంచి ప్రారంభమైన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో చంద్రబాబు స్వయంగా భాగస్వామ్యం కావడం ఒక విశేషం. ఈ కార్యక్రమం కేవలం పింఛన్‌ల పంపిణీకే పరిమితం కాకుండా, ప్రజలతో రోజంతా గడిపే అవకాశంగా మారింది. తాజాగా కోవూరు మల్కాపల్లి గ్రామంలో ఈ రోజు (జూలై 1, 2025) జరిగిన 12వ వరుస కార్యక్రమంలో, చంద్రబాబు పింఛన్ పంపిణీని పూర్తి చేసి, స్థానికులతో సంభాషించి వారి అభిప్రాయాలను, సమస్యలను తెలుసుకున్నారు. ఈ విధానం ద్వారా, ఆయన పాలనా వ్యవస్థలోని లోటుపాట్లను గుర్తించి, వాటిని సరిచేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వంటి విపక్ష నాయకులు చంద్రబాబు వయస్సును సమస్యగా పేర్కొంటూ విమర్శలు చేసినప్పటికీ, చంద్రబాబు తన చురుకైన పనితీరుతో వాటిని తిప్పికొడుతున్నారు. 70 ఏళ్ల వయసులోనూ, ఆయన ప్రజల మధ్యకు వెళ్లి, వారితో నేరుగా మాట్లాడటం, సమస్యలను వినడం వంటి చర్యల ద్వారా తన శక్తిసామర్థ్యాలను నిరూపించుకుంటున్నారు. గతంలో జగన్ ప్రభుత్వంలో ఇటువంటి చురుకైన ప్రజా సంబంధాలు కనిపించలేదని, చంద్రబాబు ఈ విషయంలో ఒక ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పవచ్చు.ఈ నూతన విధానం కేవలం పింఛన్ పంపిణీకే పరిమితం కాకుండా, ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలను సేకరించే వేదికగా మారింది. ప్రతి నెలా గ్రామస్థాయిలో జరిగే ఈ కార్యక్రమాలు, పాలనా వ్యవస్థలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంచుతున్నాయి. ఈ చర్యలు ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకాన్ని కలిగిస్తూ, చంద్రబాబు నాయకత్వంలో ఒక కొత్త ఒరవడిని సృష్టిస్తున్నాయి

# ఏం జరుగుతోంది... అన్నంలో బొద్దింకలా...

విశాఖపట్టణం, జూలై 2,



మనం భోజనం చేస్తుంటే అనుకోకుండా ఏదైనా రాయో.. ఇంకోటో వస్తే చాలా ఇబ్బంది పడతాం. ఆ సమయంలో కష్టమైనా సరే భోజనాన్ని పక్కన పెడతాం . ఎందుకంటే ఒక మనిషికి భోజనం అత్యంత ముఖ్యమైనది. ఎన్ని కష్టాలు పడినా సరే సంతృప్తిగా భోజనం చేయడానికే.. అలాంటి భోజనంలో ఏదైనా క్రిమి కనిపిస్తే.. కీటకం లాంటిది చనిపోయినట్టు అనిపిస్తే ఇంకేమైనా ఉందా.. ఇలాంటి అనుభవం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం శాఖ మంత్రి అనితకు ఎదురయింది..బీసీ హాస్టల్ ను సందర్శించడానికి ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి మంగళవారం వెళ్లారు. అక్కడ వసతి పొందుతున్న బాలికలతో మాట్లాడారు. వారికి ప్రభుత్వం తరఫున లభిస్తున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అక్కడి బాలికలతో కాసేపు మాట్లాడారు. ఈలోపు మధ్యాహ్నం భోజనం సమయం కావడంతో.. ఆమె అక్కడ పిల్లలతో కలిసి కూర్చున్నారు. విద్యార్థులతో మాదిరిగానే భోజనం చేయడానికి ఆమె రెడీ అయ్యారు. ఈ లోగానే అక్కడి హాస్టల్ నిర్వాహకులు భోజనం పెట్టారు. భోజనం తినడానికి అనిత రెడీ అవుతుండగా ఆమె ప్లేట్లో బొద్దిగా కనిపించింది. దీంతో వెంటనే ఆమె సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయకుండానే.. తన చేతికి దొరికిన బొద్దింకను చూపిస్తూ.. నేను తింటున్న ప్లేట్లోనే ఇలా బొద్దింక కనిపించింది.. ఇక విద్యార్థుల సంగతి ఏమిటని అనిత ప్రశ్నించారు.అనిత చేతికి బొద్దింక దొరికిన వీడియోను వైసీపీ అనుకూల సోషల్ మీడియా హ్యాండిల్స్ విపరీతంగా ట్రోల్ చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హాస్టళ్ల నిర్వహణ అధ్వానంగా మారిందని.. విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడవక ముందే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాలలో విఫలమైందని విమర్శించడం మొదలుపెట్టాయి.. ఇక దీనికి కూటమి నాయకులు కూడా సరిగానే స్పందిస్తున్నారు. "బొద్దింక ఉందని మంత్రి అక్కడి నుంచి వెంటనే లేచి రాలేదు. అక్కడి నిర్వాహకులతో మాట్లాడి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మీ పరిపాలన కాలంలో ఏనాడైనా ఇలా హాస్టళ్లను సందర్శించారా? విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి ఆరా తీశారా? తప్పు జరిగిందని మంత్రి చెప్పారు. దాని పరిష్కారానికి చర్యలు కూడా తీసుకుంటామని అన్నారు. ఈ మాత్రం సోయి మీ ప్రభుత్వంలో ఉందా అంటూ" కూటమి నాయకులు కౌంటర్ ఇస్తున్నారు.పాయకరావుపేట బీసీ బాలికల హాస్టల్ ను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. హాస్టల్ లో వార్డెన్ అందుబాటులో లేకపోవడం, భోజనం మెనూ సరిగా అమలు జరగకపోవడంపై సమగ్ర విచారణ చేసి రెండ్రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించాను. విద్యార్థులతో కలిసి భోజనం చేసి.. హాస్టల్ లో పరిస్థితులను అడిగి తెలుసుకోవడం?

ఇక ఈ ఘటన తర్వాత రాష్ట్రంలో ఉన్న అన్ని వసతి గృహాలపై దృష్టి సారించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. వర్షాకాలం నేపథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని.. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. బొద్దింక ఘటనను ప్రభుత్వం సీరియస్ గా తీసుకున్నట్టు తెలుస్తోంది. దీనిపై వివరణ ఇవ్వాలని సంబంధిత అధికారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. హోమ్ మంత్రి ఆకస్మికంగా వసతి గృహాన్ని సందర్శించడం వల్ల ఈ లోపాలు మొత్తం బయటికి కనిపించాయని.. రాష్ట్రంలో ఉన్న వసతి గృహాల్లో ఇలాంటి పరిస్థితులు ఉన్నాయని విద్యార్థి సంఘం నాయకులు చెబుతున్నారు.

# నేడు అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూలై 3న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. ప్లాస్టిక్ కాలుష్యం యొక్క తీవ్రమైన సమస్యలు భూమి నుండి సముద్ర జీవుల వరకు సహజ పర్యావరణానికి దాని వల్ల కలిగే తీవ్రమైన ముప్పు గురించి అవగాహన పెంచడానికి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ప్లాస్టిక్ సంచులు కుళ్ళిపోవడానికి దాదాపు 100-500 సంవత్సరాలు పడుతుంది కాబట్టి అది పల్లపు ప్రదేశాలలో పారవేయడం వలన భూమి కాలుష్యాన్ని సృష్టిస్తుంది.అది సముద్రాలలో కొట్టుకుపోతే సముద్ర జంతువుకు ప్రమాదకరమని నిరూపించబడింది. ఒకసారి మాత్రమే ఉపయోగించే ప్లాస్టిక్ సంచుల దుష్ప్రభావాలకు వ్యతిరేకంగా హెచ్చరికలను జారీ చేయడం అత్యవసరం.




బ్యాగను తయారు చెసుకొవడం. మీరు ఆనలైనలొ చూస్తె, మి స్వంత బ్యాగ్‌ను తయారు చేసుకునే సలహాలను సూచనలను అందిస్తాయి. దీని ద్వారా మీరు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవడమే కాకుండా, మరెవరికీ లేని ప్రత్యేకమైన బ్యాగ్‌ను కూడా తయారు చేసుకోవచ్చు. మీ శైలి మరియు మీ వ్యక్తిత్వాన్ని ప్రదర్శించడానికి ఇది సరైన మార్గం. మీరు మీరే తయారు చేసుకున్న బ్యాగ్‌ను మీతో తీసుకెళ్లడం పట్ల మీరు గర్వంగా భావిస్తారు.కస్టమర్లను ప్రోత్సహించండిమీకు ఒక దుకాణం ఉంటే, మీ కస్టమర్లు వారి స్వంత పునర్వినియోగ కంటైనర్లను తీసుకురావడానికి ప్రోత్సహించడానికి ప్లాస్టిక్ సంచులను అందించడం మానేయడానికి ఒక కార్యక్రమాన్ని ప్రారంభించండి.మీరు ఈ రోజున చేయగలిగే కొన్ని పనులు:మీరు ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని తగ్గించడానికి ప్రయత్నించండి.. బట్ట సంచులు లేదా ఇతర రీసైకిల్ చేయగల సంచులు ఉపయోగించండి.ప్లాస్టిక్ కాలుష్యం గురించి అవగాహన కల్పించండి.మీ స్నేహితులు మరియు కుటుంబ సభ్యులతో ఈ విషయం గురించి మాట్లాడండి.స్థానిక స్వచ్ఛంద సంస్థలతో కలిసి ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రం చేయడంలో పాలుపంచుకోండి.

# గుర్తు తెలియన వ్యక్తి దారుణ హత్య

కడప

గుర్తుతెలియని వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. బండరాళ్లతో కొట్టి చంపినట్లు అన్నవాళ్ళను పోలీసులు గుర్తించారు. యర్రగుంట్ల మార్కెట్ యార్డ్ లో గోడౌన్ వెనుక వైపు హత్య జరిగింది. మృతుడు నైట్ ప్యాంటు గ్రే కలర్ లైన్ షర్ట్ తో వున్నాడు. పోలీసులు సంఘటన స్థలికి చేరుకొని విచారిస్తున్నారు.

# బనకచర్లకు నో ఎందుకు...

ఏలూరు, జూలై 2

బనకచర్ల. ఇటీవల తరచూ వినిపిస్తున్న మాట ఇది.. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత బనకచర్ల ప్రాజెక్టు తెరపైకి వచ్చింది. సముద్రంలో కలిసే వృధా జలాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా రాయలసీమను సస్యశ్యామలం చేయాలని చంద్రబాబు భావించారు. అది పోలవరం ప్రాజెక్టు ద్వారా బనకచర్లకు అనుసంధానించి.. రాయలసీమను సస్యశ్యామలం చేయాలన్నది చంద్రబాబు ప్రణాళిక. అయితే తెలంగాణ ప్రభుత్వంతో పాటు అక్కడ అన్ని రాజకీయ పక్షాలు ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఎట్టి పరిస్థితుల్లో ఈ ప్రాజెక్టు నిర్మించకూడదని భావిస్తున్నాయి. అయితే ఇది సంక్లిష్టమైన సమస్యగా మారిన నేపథ్యంలో.. బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రం పర్యావరణ అనుమంతులను నిలిపివేసింది. ఒక విధంగా ఇది ఏపీలో కూటమి ప్రభుత్వానికి షాకింగ్ పరిణామమే. వృధా జలాలను వినియోగించుకునేందుకు.. గోదావరిలోనిరంతర నీటి ప్రవాహం ఉంటుంది. వర్షాకాలంలో అయితే భారీ స్థాయిలో వరద నీరు పోటెత్తుతుంది. ఆ సమయంలో వేల టిఎంసిల నీరు వృధాగా సముద్రంలో కలుస్తుంది. అయితే ఏటా వృధాగా సముద్రంలో కలుస్తున్న గోదావరి వరద జలాలను రాయలసీమ, ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు తరలించేందుకు వీలుగా బనకచర్ల ప్రాజెక్టును నిర్మించాలన్నది ఏపీ ప్రభుత్వ లక్ష్యం. ఏపీ ప్రభుత్వం చెబుతున్నట్టు ఏటా రెండు వేల టీఎంసీల నీరు సముద్రంలో వృధాగా కలిసిపోతుంది. అందుకే వరదల సమయంలో 200 టీఎంసీలను మళ్లించాలని ఏపీ సర్కారు నిర్ణయించింది. అందుకే గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును తెరపైకి తెచ్చింది.రూ. 80,112 కోట్లతో ఈ ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందుకోసం జలహారతి కార్పొరేషన్ ఏర్పాటుకు సైతం ఏపీ క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది.ఈ ప్రాజెక్టుతో రాయలసీమ సస్యశ్యామలంగా మారుతుంది అన్నది ప్రభుత్వ ఆలోచన. తాగునీటితోపాటు కొత్తగా మూడు లక్షల హెక్టార్ల ఆయకట్టుకు నీరు అందించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. సాగర్ కుడి కాలువ, వెలిగొండ, గాలేరు, నగరి, కెసి కెనాల్, తెలుగు గంగా కింద 22 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలన్నది ఏపీ ప్రభుత్వం నిర్ణయం. మూడు దశల్లో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలన్నది ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పోలవరం కుడి కాల్వ ద్వారా కృష్ణానదిలోకి.. అక్కడి నుంచి నాగార్జునసాగర్ కుడికాలువ ద్వారా కొత్తగా నిర్మించే బొల్లాపల్లి రిజర్వాయర్ లోకి నీటిని మళ్లించనున్నారు. అక్కడ నుంచి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్కు తరలించాలన్నది ఏపీ సర్కార్ ప్లాన్. అంటే మొదటి దశ కింద పోలవరం నుంచి కృష్ణా నదికి జలాల మళ్లింపు, సెకండ్ పేజ్ కింద గొల్లపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మించి.. అక్కడ నుంచి తరలించాలని చూస్తోంది. ఫైనల్ ఫేస్ లో భాగంగా బొల్లపల్లి నుంచి బనకచర్ల రెగ్యులేటర్ కు నీళ్లు తరలించాలని చూస్తోంది.ఈ ప్రాజెక్టు నిర్మాణానికి గాను 48 వేల ఎకరాల భూమిని సమీకరించాల్సి ఉంది. రెండు టన్నేళ్లు, 9 చోట్ల పంప్ హౌస్ ల నిర్మాణం అవసరం. కొన్నిచోట్ల గ్రావిటీ కాలువల నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రాజెక్టుకు తెలంగాణనుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఇంకా తెలంగాణతో సరిహద్దు జలాల వివాదం తేలాల్సి ఉంది. 2014 ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలోనైనా నూతన ప్రాజెక్ట్ నిర్మించాలనుకుంటే.. ముందు ఆ నది యాజమాన్యం బోర్డు, సిడబ్ల్యూసి, జల్ శక్తి మంత్రి అధ్యక్షతన ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉండే ఎఫెక్స్ కౌన్సిల్లో చర్చించి అనుమతి పొందాలి. అయితే ఈ విషయంలో ఏపీ ప్రభుత్వం నిబంధనలను ఉల్లంఘిస్తోందని తెలంగాణ ప్రభుత్వం ఆరోపిస్తోంది. దీనిపై కేంద్రానికి ఫిర్యాదు చేయడంతో.. పర్యావరణ అనుమతులు రాలేదని

బ్రేక్... మాత్రమే అంటున్న టీడీపీ

బనకచర్ల ప్రాజెక్టుకు బ్రేకులు పడ్డాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను కేంద్రం తిరస్కరించింది. బనకచర్లకు అనుమతి ఇవ్వలేమని కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. బనకచర్లకు పర్యావరణ అనుమతులు తిరస్కరించిన కేంద్రం ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సర్కార్ పంపిన ప్రతిపాదనలను వెనక్కు తిప్పి పంపింది. అయితే ఇది తాత్కాలిక బ్రేకులా? లేక శాశ్వతంగా అనుమతులు ఇవ్వరా? అన్నది తేలాల్సి ఉంది. కానీ రాజకీయ ప్రయోజనాల దృష్ట్యానే బనకచర్లకు అనుమతులు ఇవ్వకోవడానికి ప్రధాన కారణంగా తెలుస్తుంది. అందుకే ఏపీ ప్రభుత్వానికి చెందిన నేతలు మాత్రం ఇది తాత్కాలిక బ్రేకులేనని, ఖచ్చితంగా బనకచర్ల ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెబుతున్నారు.బనకచర్ల ప్రాజెక్టును చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీనిని గేమ్ ఛేంజర్ గా చంద్రబాబు అభివర్ణించారు. గోదావరిలో వృధాగా తరలిపోయే నీటిని పోలవరం ప్రాజెక్టు ద్వారా కాల్వల ద్వారా రాయలసీమతో పాటు కోస్తాంధ్రలోని అన్ని జిల్లాలకు మళ్లించాలన్నది చంద్రబాబు ఆలోచన. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమ రతనాల సీమగా మారుతుందని చంద్రబాబు నాయుడు పదే పదే చెబుతున్నారు. పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టు కోసం ఎనభైవేల కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేశార. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బీజేపీ, టీడీపీ కలసి ఉండటంతో సులువుగా అనుమతులు సాధించవచ్చని భావించి ఈ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ ను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. అయితే బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణలో రాజకీయంగా అగ్గి రాజుకుంది. తమకు న్యాయంగా దక్కాల్సిన గోదావరి నీటిని అక్రమంగా ఏపీ ప్రభుత్వం తరలించుకుపోతుందని తెలంగాణలోని అన్ని పార్టీలు ఆందోళనకు దిగాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలసి వచ్చారు. మరొకవైపు తెలంగాణ బీజేపీ నేతలు కూడా పార్టీ నాయకత్వంపై వత్తిడి తెచ్చారు.

బనకచర్లకు అనుమతులు మంజూరు చేస్తే ఆ ప్రభావం తెలంగాణ రాజకీయాల్లో పడే అవకాశముందని పార్టీ పెద్దలకు నచ్చచెప్పడంలో సక్సెస్ అయ్యారు. అందుకే పర్యావరణ అనుమతులు ఇవ్వలేమంటూ కేంద్ర, అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ పరిధిలోని నిపుణుల కమిటీ తేల్చి చెప్పింది. .. తెలంగాణ నుంచి అనేక అభ్యంతరాలు ప్రాజెక్టుపై వ్యక్తమయ్యాయి. నీటి కేటాయింపులకు విరుద్ధమంటూ ఢిల్లీ స్థాయిలోనూ, రాష్ట్ర స్థాయిలోనూ గళమెత్తారు. వరద జలాలపై సమగ్ర అధ్యయనం చేయాలంటూ డిమాండ్ చేశారు. అందుకే ముందుగా అంతరాష్ట్ర అనుమతులు ప్రాజెక్టుకు పొందాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ స్పష్టం చేసింది. దీంతో పాటు ఇప్పుడున్న పరిస్థితుల్లో నిధుల కేటాయింపు కూడా కష్టసాధ్యమవుతుందని భావించిన కేంద్ర ప్రభుత్వం ఎన్నికలు పూర్తయి తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రమే దీనిపై పునరాలోచించే వీలుందని హస్తిన వర్గాలు చెబుతున్నాయి. బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతిస్తే తెలంగాణలో రాజకీయంగా ఎదురుదెబ్బ తగులుతుందని భావించి బ్రేకులు వేసిందన్నది వాస్తవం.

# రౌడీ షీటర్ హత్య

విశాఖ. కత్తితో బెదిరించబోయిన రౌడీ షీటర్ హత్యకు గురయ్యాడు. వన్ టౌన్ పోలీసు స్టేషన్ లో రౌడీ షీటర్ గా నమోదయిన నాగమణి ఎల్లాజీ (35) ఈ మధ్యకాలంలోనే సెంటర్ జైలు నుంచి విడుదలయ్యాడు.

కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జ్ఞానాపురం, హిందూ స్మశాన వాటికలో పనిచేస్తున్న వాళ్ల దగ్గర కత్తి చూపించి బెదిరించి డబ్బులు డిమాండ్ చేసాడు. అక్కడ పని చేస్తున్న మూర్తి అనే వ్యక్తి గడ్డపారతో కొట్టగా నాగమణి ఎల్లాజీ అక్కడికక్కడే మృతి చెందాడు.

## ఎరువుల కొరత లేకుండా చూడాలి

### ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లు, వ్యవసాయాధికారులకు మంత్రి జూపల్లి ఆదేశం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎరువుల కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు సమన్వయంతో పని చేయాలని, జిల్లా కలెక్టర్ల నిరంతర పర్యవేక్షణ ఉండాలని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. జిల్లాల వారీగా విత్తనాలు, ఎరువులకు డిమాండ్?, ప్రస్తుత నిల్వలు ఎంత అవసరం ఉంటుందనే అంశాలను పరిశీలించి ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. సరఫరా విషయంలో ప్రాథమిక సహకార సంఘం, మార్క్‌ఫెడ్ శాఖల వద్ద ఎలాంటి జాప్యం జరగకూడదని అన్నారు .వ్యవసాయ విస్తరణాధికారులు.. ప్రభుత్వ, ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు చేసి, స్టాక్ ఉందో లేదో పరిశీలించాలని, ఇవాల్టి నుంచి ఎరువుల సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని చెప్పారు. డిమాండ్ అనుకూలంగా ఎరువులు సరఫరా చేయాలని, వ్యవసాయ శాఖ ప్రధాన కార్యాలయంతో సమన్వయం చేసుకోవాలని, ఇండెంట్ ప్రకారం స్టాక్ ఉండాలని, ఎక్కడైనా ఎరువుల కొరత ఉందని దృష్టికి వస్తే సంబంధిత వ్యవసాయాధికారిదే బాధ్యత అని స్పష్టంచేశారు.

## పాపికొండల యాత్రకు బ్రేక్

గోదావరి నదికి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో పాపికొండల విహారయాత్రను నిలిపివేస్తూ జలవనరులశాఖ ఆదేశాలు జారీ చేసింది. వర్షంతోపాటు గోదావరిలో నీటిమట్టం పెరుగుతున్న కారణంగా ముందస్తు జాగ్రత్తగా ఈ..నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. యాత్ర ప్రారంభమయ్యే తదుపరి తేదీని త్వరలోనే వెల్లడిస్తామని వివరించింది.

## పునర్నిర్మాణ యుగం ప్రారంభమైంది

### ప్రజల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన జీవన స్థితిని కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### తెదేపా నేత మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు

నందిగామ: జులై 02సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు పాల్గొన్నారు. బుధవారం నందిగామలో పార్టీ శ్రేణులతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవినేని ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ప్రజల సంక్షేమం కోసం, ముఖ్యంగా రైతులు, మహిళలు, యువత మరియు వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. "సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు, పాలనలో జవాబుదారీతనం, పారదర్శకతను నిర్ధారించడమే కూటమి లక్ష్యం," అని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలపై ప్రతి ఇంటిలోకి వెళ్లి గడపగడపకూ చంద్రబాబు నాయుడు సంకల్పాన్ని చాటిచెప్పాలన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ హయాంలో జరిగిన నష్టంతో పాటు ఏడాది కాలంలోనూ ప్రజలుమెచ్చిన పాలన అందించామని గణాంకాలతో అందించాలని వివరించారు. అత్యధిక కుటుంబాలకు మేలు చేకూర్చేలా తల్లికి వందనం కింద గతంలో ఒక్కరికే రూ.15 వేలు చెల్లిస్తే, ఇప్పుడు ఇద్దరికి మించి పిల్లలున్న వారందరికి రూ.30 నుంచి 60వేల వరకు తల్లి ఖాతాలో జమ చేసిన విషయానికి ప్రాధాన్యత వివరించాలన్నారు. పట్టణప్రాంతాల్లో చెత్తపన్ను రద్దు చేయడం, పేదల కోసం అన్నక్యాంటీన్లను ప్రారంభిం చడం, నెలవారీ పింఛన్‌ను రూ.నాలుగు వేలకు పెంచడం, ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టే జీవో 117 రద్దు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, మెగా డీఎస్సీ, ఒంటరి మహిళలకు పింఛన్లు, డ్వాక్రా సంఘాల్లో రుణ వితరణలో ప్రాధాన్యత వంటి అంశాలతో పాటు ఉచితగ్యాస్ పథకమే కాకుండా కొద్దిరోజుల వ్యవధిలోనే అన్నదాత సుఖీభవ కింద రైతులకు అండగా నిలవడం, ఆగస్టు నుంచి మహిళలందరికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయాన్ని ప్రజలకు వివరించేందుకు అడుగులు వేస్తున్నామని దేవినేని ఉమా చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో కూటమి నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దుకాణంలోకి దూసుకుపోయిన లారీ, వ్యాన్ డ్రైవర్లకు గాయాలు

ఏలూరు తల్లాడ , దేవరపల్లి జాతీయ రహదారి జంగారెడ్డిగూడెం మండలం వేగవరం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక లారీ , వ్యాను రోడ్డు మార్జిన్ లలో ఉన్న దుకాణంలోకి దూసుకువెళ్లిన వైనం. ఘటనలో డ్రైవర్లకు గాయాలు అయ్యాయి.

# కర్ణాటక కాంగ్రెస్ లో మళ్లీ అలజడి

బెంగళూరు, జూలై 2,

కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై మరోసారి ఊహాగానాలు ఊపందుకున్నాయి. విజయదశమి నాటికి అధికార కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి పీఠంతోపాటు పిసిసి అధ్యక్ష స్థానం, మంత్రివర్గంలో మార్పులు చోటుచేసుకుంటాయని కొద్ది రోజులుగా కాంగ్రెస్ అసమ్మతి నేతలు బహిరంగంగానే ప్రకటనలు చేస్తున్నారు. అయితే అధికార మార్పిడి ఉండబోదని, సిద్ధరామయ్యే పూర్తికాలం పదవిలో కొనసాగుతారని ఆయన వర్గం నేతలు ధీమాగా ఉన్నారు. ఒకవేళ ముఖ్యమంత్రి స్థానాన్ని ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్‌కు వదిలి పెట్టాల్సిన పరిస్థితి వస్తే పిసిసి అధ్యక్ష పదవిని తనకు చిరకాలంగా మద్దతు ఇస్తూ వస్తున్న మంత్రి సతీశ్ జార్ఖిహ్వాళికి కట్టబెట్టాలని సిద్ధరామయ్య పార్టీ అధిష్ఠానాన్ని కోరినట్లు సమాచారం.మరోవైపు కర్ణాటకలో అధికార మార్పిడి గురించి సోమవారం విలేఖరులు అడిగిన ప్రశ్నకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ, అంతా పార్టీ అధిష్ఠానవర్గం చేతుల్లో ఉందని వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ విషయంపై ప్రతిపక్ష బిజెపి నేత తేజస్వి సూర్య స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీలో అధిష్ఠానవర్గం అనేది దయ్యం లాంటిదని, అది ఎవరికీ కనిపించదు, వినిపించదని ఎద్దేవా చేశారు. పార్టీకి అధ్యక్షుడు అధిష్ఠానం కానప్పుడు మరెవరని కూడా ఆయన ఎదురుప్రశ్న వేశారు. మరోవైపు రాష్ట్ర కాంగ్రెస్‌లో ఎలాంటి లుకలుకలు లేవని, తాను, శివకుమార్‌లు కలిసి బాగానే పని చేస్తున్నామని చెప్పడానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రయత్నిస్తున్నారు. మైసూరులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఇరువురు నేతలు చేతులు పట్టుకుని పైకెత్తి తాము కలిసే ఉన్నామని చెప్పే ప్రయత్నం చేశారు.అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటినుంచీ ఇరువురు నేతలు కలిసి ఉన్నట్లు పైకి కనిపించినా ఇద్దరి మధ్య దూరం కొనసాగుతూనే ఉందనేది పార్టీ వర్గాల అభిప్రాయం. వాస్తవానికి 2023లో కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించినప్పటినుంచి కూడా ముఖ్యమంత్రి పీఠంపై వివాదం కొనసాగుతూనే ఉంది. సిఎం పదవికోసం సిద్ధరామయ్యతో పాటు శివకుమార్ కూడా గట్టిగానే ప్రయత్నించారు. ఇరువురూ చెరి రెండున్నరేళ్లు సిఎం పదవి చేపట్టేలా ఒప్పందం కుదిరినట్లు అప్పట్లో పెద్ద ఎత్తున ప్రచారం కూడా జరిగింది. అయితే దీనిపై అటు పార్టీ అధిష్ఠానం కానీ, ఇటు సిద్ధరామయ్య, శివకుమార్‌లు కానీ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. రాష్ట్రంలో సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పదవి చేపట్టి రెండేళ్లు పూర్తి కావస్తుండడంతో ఇప్పుడు మరోసారి నాయకత్వం మార్పుపై ఊహాగానాలు మొదలయ్యాయి.వాస్తవానికి ముడా స్కామ్, వాల్మీకి కార్పొరేషన్ కుంభకోణం వెలుగులోకి వచ్చినప్పటినుంచి సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పదవినుంచి తప్పుకోవాలని అటు ప్రతిపక్ష బిజెపితో పాటుగా ఇటు కాంగ్రెస్‌లోని అసమ్మతి నేతలు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. అంతేకాదు, సిద్ధరామయ్య తప్పుకోకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రెండుగా చీలిపోతుందని అప్పుడు 'సందట్లో సడేమియా'గా తాము అధికారంలోకి రావచ్చని కాషాయ నేతలు భావిస్తున్నారని, కాంగ్రెస్‌లో అసమ్మతి కుంపట్ల వెనుక ఆ పార్టీ హస్తముందన్న విమర్శలు కూడా ఉన్నాయి. అధికారంలోకి రావడంకోసం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి ఖాళీ ఖజానా పెద్ద అడ్డంకిగా మారడంతో సిద్ధరామయ్య సర్కార్‌పై ప్రజల్లో అసహనం మొదలైంది. దీనికి తోడు నిధులు లేకపోవడం, ఎక్కడికక్కడ అభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోవడంతో అధికార పార్టీ నేతల్లో సైతం అసంతృప్తి ఉంది. ఈ తరుణంలో మళ్లీ పార్టీలో అసమ్మతి గళం బలంగా వినిపించడం మొదలైంది.డిప్యూటీ సిఎం శివకుమార్ రెండు, మూడు నెలల్లో ముఖ్యమంత్రి అవుతారంటూ ఆయనకు సన్నిహితుడైన కాంగ్రెస్ ఎంఎల్‌ఎ ఇక్బాల్ హుస్సేన్ రెండు రోజుల క్రితం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది చివర్లోగా కర్ణాటకలో నాయకత్వ మార్పు చేయాలని అధిష్ఠానం భావిస్తోందనే ఊహాగానాలు వినిపిస్తున్న తరుణంలో ఇక్బాల్ కామెంట్స్ రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ఎవరు చెమటోడ్చారో అందరికీ తెలుసునని కూడా ఆయన వ్యాఖ్యానించడం గమనార్హం. తాను దాపరికపు మాటలు చెప్పనని, వాస్తవాలే చెప్తున్నానని ఆయన చేసిన వ్యాఖ్యలతో పరిస్థితి చేయిదాటేలా ఉందని కాంగ్రెస్ అధిష్ఠానం కూడా భావించినట్లు కనిపిస్తోంది.కర్ణాటక పార్టీ వ్యవహారాల ఇంచార్జి, పార్టీ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సుర్జేవాలాను హుటాహుటిన బెంగళూరుకు పంపించింది. మూడు రోజులపాటు రాష్ట్రంలోనే ఉండనున్న ఆయన అసమ్మతి ఎంఎల్‌ఎలందరితో ముఖాముఖి మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకుంటారని, ఆ తర్వాత అధిష్ఠానానికి ఆయన అందించే నివేదికపై సిద్ధరామయ్య భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఏదిఏమైనా కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిస్థితి మొదటినుంచీ కలహాల కాపురంగానే ఉండడం గమనార్హం. పార్టీ అధికారంలో ఉన్న మూడు రాష్ట్రాల్లో అత్యంత కీలకమైన కర్ణాటకలో పరిస్థితితో కాంగ్రెస్ అధిష్ఠానానికి కూడా తల బొప్పి కడుతోంది.

# శిరీష్ వర్సెస్ మెగా ఫ్యాన్స్

హైదరాబాద్, జూలై 2,

ప్రముఖ నిర్మాత దిల్ రాజు సోదరుడు శిరీష్ ' గేమ్ ఛేంజర్ ' చిత్రంపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. 'గేమ్ ఛేంజర్' డిజాస్టర్ అయిన తర్వాత మాకు ఎవరైనా సాయం చేశారా? రామ్ చరణ్ ఏమైనా సాయం చేశారా? డైరెక్టర్ ఏమైనా సాయం చేశారా? కనీసం కర్టసీ కోసమైనా ఫోన్ చేసి మాట్లాడలేదు అని శిరీష్ చెప్పుకొచ్చారు. అయితే ఆయన వ్యాఖ్యలు మెగా అభిమానులకు కోపం తెప్పించాయి. దీంతో శిరీష్ నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోమని హెచ్చరిస్తూ ఓ లేఖ విడుదల చేశారు.'మెగా అభిమానులుగా 'గేమ్ ఛేంజర్' సినిమా కోసం మూడేళ్లుగా ఎదురుచూశాం. దానిపై ఎన్నో ఆశలు పెట్టుకుంటే ఫ్లాప్ అయింది. అసలే మేం ఆ బాధలో ఉంటే మీరు ప్రతిరోజూ ఆ సినిమా గురించి ఏదొకటి మాట్లాడుతూ, హీరోపైనా, సినిమాపైనా విషం చిమ్ముతున్నారు. ప్రతి ప్రెస్‌మీట్‌లో 'గేమ్ ఛేంజర్' గురించి పదేపదే మాట్లాడుతూ మాకు మానసిక క్షోభ కలిగిస్తున్నారు. మీకు ఇదే చివరి హెచ్చరిక. రామ్‌చరణ్ గురించి గానీ, 'గేమ్ ఛేంజర్' మూవీ గురించి గానీ ఇంకోసారి తప్పుగా మాట్లాడితే మీరు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది' అంటూ చెర్రీ ఫ్యాన్స్ ఓ లేఖ విడుదల చేశారు. ఇందులో శిరీష్‌కు ఆరు ప్రశ్నలు సంధించారు.

× గేమ్ ఛేంజర్ పోయింది.. హీరో ఏమైనా సాయం చేశాడా?.. నిర్మాత శిరీష్ సంచలన కామెంట్స్

సినిమా అనేది ఒక బిజినెస్. అందులో లాభాలు వస్తుంటాయి, నష్టాలు వస్తుంటాయి. మీ ప్రొడక్షన్ హౌస్‌లో మీరు చేసే సినిమాలన్నీ మీ వల్లే విజయాలు, లాభాలు వచ్చాయని చెప్పుకునే మీరు.. ఓ సినిమా ఫ్లాప్ అయితే మాత్రం మిగతా వాళ్లపై నింద మోపడం కరెక్ట్ కాదని లేఖలో పేర్కొన్నారు.

మెగా ఫ్యాన్స్ లేఖలో సంధించిన ప్రశ్నలివే..

× నేనొక్కడినే సమయంలో 14 రీల్స్ సంస్థ హీరో గురించి ఒక్కసారైనా మాట్లాడారా?

× మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్లో ఫ్లాప్ వచ్చినప్పుడు ఎవరైనా హీరోల గురించి తప్పుగా మాట్లాడారా?

×'సైంధవ్' మూవీ ఫ్లాప్ అయ్యాక ఆ ప్రొడ్యూసర్.. వెంకటేష్ గురించి ఎందుకు ఒక్కమాట కూడా మాట్లాడలేదు?

× 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకి వెంకటేష్‌కి ఎంతిచ్చారు? రిలీజ్‌కి ముందు ఎంతిస్తామన్నారు?.. హిట్ అయ్యాక ఎక్స్‌ట్రా ఏమైనా ఇచ్చారా?

× డైరెక్టర్ శంకర్ ఉన్నాడని వెళ్లింది ఎవరు?.. సంవత్సరం అని చెప్పి మూడేళ్లు వేస్ట్ చేసింది ఎవరు?

× 'ఆర్‌ఆర్‌ఆర్' తర్వాత మీతో చేసిన సినిమా హీరో మీద విషం చిమ్మడం కరెక్టేనా?

× గుంటూరు కారంతో 8 కోట్లు నష్టం.. మైత్రి నక్క. నాగవంశీ నాగలోకం : శిరీష్

ఇలా శిరీష్‌ని టార్గెట్ చేస్తూ మెగా అభిమానులు వరుస ప్రశ్నలతో ఓ లేఖ విడుదల చేశారు. ఇంకోసారి తమ హీరోని టార్గెట్ చేస్తూ ఎవరైనా నోటికొచ్చినట్లు మాట్లాడితే తాము ఊరుకోమని.. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని మెగా ఫ్యాన్స్ హెచ్చరించారు. ఈ లేఖ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# కనీసం ముగ్గురు పిల్లలను కనండి

న్యూయార్క్, జూలై 2,

ఎక్స్ వేదికగా ఓ వినియోగదారు చేసిన పోస్టుకు మస్క్ స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఫార్చ్యూన్ నివేదికను ప్రస్తావిస్తూ.. జనాభా స్థిరంగా కొనసాగాలంటే ఒక మహిళకు సగటున 2.1 మంది పిల్లలు సరిపోరని, ఆ సంఖ్య 2.7గా ఉండాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారని ఆ పోస్టులో పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికాలో ఈ రేటు 1.66గా ఉండగా, ఇటలీలో 1.29, జపాన్‌లో 1.3గా ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. పిల్లలు లేనివారు, లింగ అసమతుల్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ కొత్త సంఖ్యను నిర్ధారించినట్లు తెలిపారు. ఈ పోస్టును రీపోస్ట్ చేసిన మస్క్ "పిల్లలు లేనివారు లేదా ఒక్కరే బిడ్డ ఉన్నవారి లోటును భర్తీ చేయాలంటే, పిల్లలు ఉన్నవారు కచ్చితంగా ముగ్గురిని కనాలి. లేకపోతే జనాభా కుప్పకూలిపోతుంది" అని వ్యాఖ్యానించారు. తన మాటలను ఇప్పుడు నమ్మకపోయినా, 20 ఏళ్లలో నిజం తెలుస్తుందని ఆయన హెచ్చరించారు. జననాల రేటు తగ్గడానికి, గతంలో నాగరికతలు అంతరించిపోవడానికి మధ్య బలమైన సంబంధం ఉందని మస్క్ ఎప్పటినుంచో వాదిస్తున్నారు. పురాతన రోమ్ పతనానికి తక్కువ జననాల రేటే ప్రధాన కారణమని, కానీ చాలా మంది చరిత్రకారులు ఈ విషయాన్ని పట్టించుకోలేదని ఆయన గతంలో వ్యాఖ్యానించారు. మస్క్‌కు ప్రస్తుతం 14 మంది సంతానం ఉండటం గమనార్హం. మస్క్ ఆందోళనలకు బలం చేకూరుస్తూ ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్ నివేదిక కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా సంతానోత్పత్తి రేట్లు గణనీయంగా తగ్గుతున్నాయని 'ది రియల్ ఫెర్టిలిటీ క్రైసిస్' పేరుతో విడుదలైన 2025 ప్రపంచ జనాభా నివేదికలో వెల్లడించింది. పిల్లల పెంపకం ఖర్చు విపరీతంగా పెరగడం, సరైన భాగస్వామిని ఎంచుకోవడంలో జాప్యం వంటి కారణాలతో చాలా మంది కోరుకున్నంత మంది పిల్లలను కనలేకపోతున్నారని పేర్కొంది. ఈ నివేదికలో భారత్‌కు సంబంధించిన ఆందోళనకరమైన విషయాలు కూడా ఉన్నాయి. భారతదేశంలో మొత్తం సంతానోత్పత్తి రేటు (టీఎఫ్‌ఆర్) 1.9కి పడిపోయిందని, ఇది జనాభా స్థిరత్వానికి అవసరమైన 2.1 కంటే తక్కువని యూఎన్‌ఎఫ్‌పీఏ స్పష్టం చేసింది. "విద్యావకాశాలు మెరుగుపడటం, పునరుత్పత్తి ఆరోగ్య సంరక్షణ అందుబాటులోకి రావడం వల్ల 1970లో 5గా ఉన్న సంతానోత్పత్తి రేటు ప్రస్తుతం 2కి తగ్గింది. ఇది గొప్ప ప్రగతే అయినప్పటికీ, తగ్గుతున్న రేటు భవిష్యత్తులో సవాళ్లను విసరనుందని యూఎన్‌ఎఫ్‌పీఏ ఇండియా ప్రతినిధి ఆండ్రియా ఎం వోజ్నార్ తెలిపారు

## గుట్టలో మంత్రి అడ్లూరి ప్రత్యేక పూజలు

యాదాద్రి

ఎస్సీ,ఎస్టీ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని బుధవారం వేకువ జామున దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మంత్రి వెంట ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వున్నారు.

మంత్రికి ఆలయ అర్చకులు ఆలయ సంప్రదాయ స్వాగతం వలికారు. వేదపండితులు వేదాశీర్వచనం చేసారు. కార్యనిర్వాహణాధికారి ఎస్ వెంకట్రావు శ్రీ స్వామి వారి చిత్ర పటం,లడ్డు ప్రసాదం అందజేసారు.

## మహంకాళి జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలి

### ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సికింద్రాబాద్

సికింద్రాబాద్ లోని శ్రీ ఉజ్జాయినీ మహంకాళి ఆలయం ఆవరణలో మగ్గంపై చీరల తయారీని ఎమ్మెల్యే తలసానిశ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. 13 వ తేదీన నిర్వహించే మహంకాళి జాతరలో అమ్మవారికి పోచంపల్లి పట్టు వస్త్రాల సమర్పణ జరగనుంది. తలసాని మాట్లాడుతూ లక్షలాది గా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు చేయాలి. 10 సంవత్సరాలు తాను కష్టపడి తీసుకొచ్చిన వ్యవస్థ తోనే ఘనంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం జరిగింది. బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం, మహంకాళి జాతర, భద్రాచలం రాముల వారి కళ్యాణం లకు వస్త్రాలను పద్మశాలి సంఘం సభ్యులు అందిస్తున్నారని అన్నారు.

## మృతదేహం తరలించడంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం

రాజన్న సిరిసిల్ల

జిల్లా ప్రధాన ఆసుపత్రిలో సిబ్బంది నిర్లక్ష్యం బయటపడింది. అనారోగ్యం వల్ల గుండెపోటుతో సిరిసిల్ల కు చెందిన రాజయ్య(73) అనే వృధ్ధుడు ఆసుపత్రిలో మృతి చెందాడు. పార్థివ వాహనం కోసం రెండు గంటల పాటు మృతదేహంతో కుటుంబ సభ్యుల పడిగాపులు కాసారు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా సిబ్బంది స్పందించలేదు. కుటుంబసభ్యులు చివరికి ప్రైవేట్ అంబులెన్స్ లోనే మృతదేహం తరలించారు.

## సిగాచి పరిశ్రమలో పేలుడు భయాందోళనలో పరిసర ప్రాంతాలు

సంగారెడ్డి

సిగాచి పరిశ్రమలో పేలుడు ఘటన తో ఆ పరిసరాల పరిశ్రమల కార్మికులు భయాందోళనలో వున్నారు. మూడు రోజుల క్రితం ఉదయం 9 గంటల 27 నిమిషాలకు పరిశ్రమలో పేలుడు జరిగింది. భారీ పేలుళ్ల ధాటికి చుట్టుపక్కల ప్రాంతాల్లో పరిసర ప్రాంతాలు దద్దరిల్లాయి. భూప్రకంపనలు రావడంతో అంతా ఉలిక్కిపడ్డారు. పరిశ్రమ పక్కనే ఉన్న డింబర్ డిపోలోని సీసీ ఫుటేజ్ లో పేలుడు దృశ్యాలు రికార్డ్ అయ్యాయి.

## కరీంనగర్ జిల్లాలో ఇందిరమ్మ ఇల్లు లొల్లి కలకలం

కరీంనగర్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల లొల్లి రాజకీయంగా దుమారం రేపుతుంది. రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయితే బిఆర్ఎస్ తట్టుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మానకొండూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇల్లు పొందిన కొండపల్కల గ్రామ శాఖ బిఆర్ఎస్ అధ్యక్షులు బొల్లం శ్రీనివాస్ ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం వివాదాస్పదంగా మారింది. నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీనివాస్ కు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో పునాదులు తీసి ఇల్లు నిర్మించుకునే పనిలో నిమగ్నమం కాగ పార్టీ పెద్దలు అతన్ని బిఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేశారు. ఇల్లు లేని తనకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తే పార్టీ నుంచి సస్పెండ్ చేయడం ఏంటని శ్రీనివాస్ ప్రశ్నిస్తున్నారు. మానకొండూర్ నియోజకవర్గంలో తన ఒక్కరికే కాదు 270 మంది టిఆర్ఎస్ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు బిఆర్ఎస్ పొందద్దు అనుకుంటే రైతు భరోసా పెట్టుబడి సహాయం పొందిన బిఆర్ఎస్ కార్యకర్తల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేకు అమ్ముడుపోయానని ఆరోపించే మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, రెండు నెలలు పర్సనల్ ఫోటోగ్రాఫర్ పని చేయించుకుని ఏమి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసిఆర్ పై ఉన్న అభిమానంతో రూపాయి ఆశించకుండా రసమయికి పని చేశానని ఏం సహాయం చేయని రసమయి, కాంగ్రెస్ ప్రభుత్వం తనకు చేసిన సహాయాన్ని చూసి తట్టుకోలేక పార్టీ నుంచి సస్పెండ్ చేశారని ఆందోళన వ్యక్తం చేశారు.

## వైకాపా నేత ఇంట్లో సీబీఐ సోదాలు

విజయవాడ వైకాపా నేత బత్తల హరిప్రసాద్ నివాసంలో మంగళవారం రాత్రి సిబిఐ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఆయన అందుబాటులో లేనట్లు సమాచారం. దాంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చిన అధికారులు అవసరమైన సమాచారాన్ని సేకరించారు. వైద్యకళాశాలల్లో సీట్ల భర్తీ, ప్రైవేటు కళాశాలలకు అనుమతులు ఇప్పించే విషయంలో ఆయన లంచాలు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి.

## మూడు రోజులుగా నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తి

ఖమ్మం జూలై 2,

సత్తుపల్లిలో మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షానికి జేవిఆర్ ఓసి, కిష్టారం ఓసిలల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. జేవిఆర్ ఓసి లో 30 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, లక్ష 20 వేల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత పనులకు అంతరాయం కలిగింది. కిష్టారం ఓసిలో 8 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 65 వేల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత పనులు నిలిచిపోయాయి. ఉపరితల గనులల్లో వరద నీరు చేరటంతో బొగ్గు గనుల బ్లాక్ లు చిత్తడి చిత్తడిగా మారటంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. గనుల్లో నిలిచిన వర్షపు నీరును కార్మికులు మోటర్ల సహాయంతో బయటకు తోడుతున్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగు.., ఇంటింటికీ టీడీపీకార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యేలు..

చిత్తూరు

సుపరిపాలనలో తొలి అడుగును, బుధవారం చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని ఒకటవ వార్డు, యం.అగ్రహారంలో ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ప్రారంభించారు.ముందుగా దొడ్డి పల్లెలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను ఆవిష్కరించారు.ఇంటింటికీ టిడిపి కార్యక్రమంలో భాగంగా యం.అగ్రహారంలోని ప్రతి గడప కెళ్ళి సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను ప్రజలకందిస్తూ.. ప్రజలతో ఆప్యాయంగా పలకరిస్తూ.., కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజానికానికి వివరించారు ఎంపీ, ఎమ్మెల్యేలు.

కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, , రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు రి నేతృత్వంలో.. ఆంధ్రప్రదేశ్ ప్రగతి పథం వైపు పయనిస్తుందని ఎంపి, ఎమ్మెల్యే అన్నారు.అర్హులైన ప్రతిఒక్కరికీ.. సూపర్ సిక్స్ పథకాలను చేరువచేస్తున్నాం... పేదలు లేని సమాజ స్థాపనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు.

ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు టిడిపి జిల్లా అధ్యక్షుడు సి.ఆర్.రాజన్, రు,, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నగర కార్పొరేషన్ మేయర్ కుమారి అముద, చూడా ఛైర్పర్సన్ కఠారి హేమలత, టీడీపీ సీనియర్ నేత కాజూరి బాలాజీ, తదితరులు పాల్గొన్నారు. .

## పాశమైలారానికి మీనాక్షి నటరాజన్

సంగారెడ్డి పాశమైలారం సిగాచీ పరిశ్రమలో జరిగిన ఘోర అగ్నిప్రమాద స్థలాన్ని ఏఐసీసీ తెలంగాణ ఇన్ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి బుధవారం సందర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను మంత్రి దామోదర్ రాజనర్సింహను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు తగిన న్యాయం కల్పించాల్సిందిగా నేతలు కోరారు.

## త్రిశక్తి మాత ఆలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాల భాగంగా అమ్మవారికి లక్ష పుష్పార్చన

కోరుట్ల,పట్టణంలో గణేశ నవదుర్గ మండలి ఆధ్వర్యంలో త్రిశక్తి మాత ఆలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వారాహి మాత కు మంగళవారం రాత్రి లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు.వారాహి నవరాత్రులు ఆషాఢ మాసంలో 9 రోజుల పాటు జరుపుకునే ఒక ముఖ్యమైన పండుగ అని ఈ సమయంలో వారాహి దేవిని పూజించడం ద్వారా భక్తులు శత్రువుల నుండి రక్షణ పొందుతారని, కోరిన కోరికలు నెరవేరుతాయని నమ్ముతారు. ఈ నవరాత్రులు జూన్ 26 నుండి జూలై 4 వరకు జరుపుకుంటారు. వారాహి నవరాత్రుల ప్రత్యేకత ఏంటంటే శత్రువుల నుండి రక్షణ వారాహి దేవిని పూజించడం ద్వారా శత్రువుల నుండి దుష్ట శక్తుల నుండి రక్షణ లభిస్తుందని భక్తులు నమ్ముతారు. వారాహి దేవి అనుగ్రహంతో భక్తుల కోరిన కోరికలు నెరవేరుతాయని విశ్వసిస్తారు. ఆషాఢ మాసంలో వచ్చే ఈ నవరాత్రులు గుప్త నవరాత్రులలో భాగంగా జరుపుకుంటారని తెలిపారు.గణేశ నవదుర్గ మండలి ప్రధాన కార్యదర్శి గజ్జల శంకర్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి వారాహి దేవి నవరాత్రులు జరుపుతున్నామని, కానీ ఈ సంవత్సరం నుండి ప్రత్యేకంగా అమ్మవారి విగ్రహం పెట్టి వారాహి పూజలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.వారాహి మాత నవరాత్రులు జరుపుకోవడం పట్టణంలో ఇదే మొదటి మొదటిసారి అని ప్రతిరోజు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.దసరా నవరాత్రులకు, వారాహి నవరాత్రులకు తేడా ఉంటుందని వారాహి నవరాత్రులను గుప్త నవరాత్రులు అంటారని, ఈ మాతకు రాత్రి వేళ పూజిస్తారని, వారాహి మాతకు రాత్రి వేళలో ధూపం, దీపం, నైవేద్యం అభిషేకం హోమం ఉంటాయని, సూర్యాస్త సమయములో పూజ కార్యక్రమాలు జరుపుకుంటారని ఆయన తెలిపారు.ఈకార్యక్రమంలో గణేశ నవదుర్గ మండలి గౌరవ అధ్యక్షులు కట్ట నారాయణ, అధ్యక్షులు కటుకం గణేష్, ప్రధాన కార్యదర్శి గజ్జల శంకర్, కోశాధికారి అడువాల ప్రభాకర్ కార్యవర్గ సభ్యులు గాజుల రమేష్, లక్కంపల్లి విజయ్, నవీన్ కార్యకర్తలు కటుకం గంగారాం, చింతకింది సత్యనారాయణ, కార్తీక్, ప్రవీణ్, రాము, కళ్యాణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఐదు దేశాల్లో మోడీ టూర్...

న్యూఢిల్లీ, జూలై 2,

భారత ప్రధాని నరేంద్ర మోడీ నేటి నుంచి ఎనిమిది రోజుల పాటు ఐదు దేశాల సుదీర్ఘ పర్యటనకు బయలుదేరనున్నారు. గత దశాబ్ద కాలంలో మోడీ చేస్తున్న అత్యంత సుదీర్ఘమైన విదేశీ పర్యటన ఇది. ఈ పర్యటనలో ఆయన ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా దేశాలను సందర్శించనున్నారు. ముఖ్యంగా బ్రెజిల్‌లో జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనడం ఈ పర్యటనలోని ప్రధాన ఉద్దేశ్యం. గ్లోబల్ సౌత్ దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడం, వాణిజ్యం, రక్షణ, శక్తి రంగాల్లో సహకారాన్ని పెంపొందించడంపై ప్రధాని మోడీ దృష్టి సారించనున్నారు. అలాగే, ప్రధానమంత్రి బ్రెజిల్‌లో జరిగే కీలకమైన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలోనూ పాల్గొంటారు.ప్రధాని మోదీ చివరి ఎనిమిది రోజుల పర్యటన జులై 2015లో ఆరు దేశాల పర్యటనకు వెళ్లారు. ఆ సమయంలో ప్రధాని మోడీ రష్యాతోపాటు ఐదు మధ్య ఆసియా దేశాలను సందర్శించారు. ఈ పర్యటన రక్షణ, అరుదైన భూమి ఖనిజాలు, ఉగ్రవాద నిరోధక చర్యలపై సహకారం వంటి అంశాలపై దృష్టి సారిస్తుందని అధికారులు తెలిపారు.మోడీ పర్యటన ఘనాతో ప్రారంభమైంది. మూడు దశాబ్దాల తర్వాత భారత ప్రధాని ఘనాలో పర్యటించడం ఇదే మొదటిసారి.ఘనా అధ్యక్షుడితో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఆర్థికం, ఇంధనం, రక్షణ రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవడంపై చర్చిస్తారు.

పశ్చిమ ఆఫ్రికా రాష్ట్రాల ఆర్థిక సంఘం, ఆఫ్రికన్ యూనియన్‌తో భారతదేశ సంబంధాలను బలోపేతం చేయడానికి ఈ పర్యటన దోహదపడుతుంది.వ్యాక్సిన్ హబ్‌ను ఏర్పాటు చేయడానికి మద్దతు ఇస్తారు.ఘనా పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగిస్తారు.

పశ్చిమ ఆఫ్రికాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఘనా ఒకటి. ఘనా ఎగుమతులకు భారతదేశం అతిపెద్ద గమ్యస్థానం. ఘనా నుంచి భారతదేశం చేసే దిగుమతుల్లో బంగారం 70 శాతానికి పైగా ఉంది. జనవరిలో ఘనా అధ్యక్షుడిగా ఎన్నికైన జాన్ మహామా, 2015లో ఇండియా-ఆఫ్రికా ఫోరం సమ్మిట్ కోసం భారతదేశాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే.

జులై 3-4: ట్రినిడాడ్ అండ్ టొబాగో

ఘనా పర్యటన అనంతరం కరేబియన్ దేశమైన ట్రినిడాడ్ అండ్ టొబాగోకు మోడీ బయలుదేరుతారు.

1999 తర్వాత భారత ప్రధాని ఈ దేశంలో పర్యటించడం ఇదే ప్రథమం.

ట్రినిడాడ్ అండ్ టొబాగో అధ్యక్షురాలు క్రిస్టీన్ కార్లా కంగలూ,



ప్రధాన మంత్రి కమ్లా పెర్సాద్-బిస్సేసర్‌లతో మోడీ సమావేశమవుతారు.

ఈ దేశ పార్లమెంటు ఉమ్మడి సమావేశంలో ప్రధాని మోడీ ప్రసంగించనున్నారు.

ఇరు దేశాల మధ్య దీర్ఘకాలిక, చారిత్రక సంబంధాలకు ఈ పర్యటన కొత్త ఊపునిస్తుందని విదేశాంగ శాఖ తెలిపింది. ఆరోగ్యం, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ రంగాల్లో సహకారంపై దృష్టి సారిస్తారు.

ఘనా నుంచి మోడీ జులై 3 నుంచి రెండు రోజుల పర్యటన కోసం ట్రినిడాడ్, టొబాగోకు వెళతారు. 1999 తర్వాత భారత ప్రధానమంత్రి ఆ దేశానికి చేయడం ఇదే మొదటిసారి.

జులై 4-5: అర్జెంటీనా

కరేబియన్ దేశం నుంచి నేరుగా దక్షిణ అమెరికాలోని అర్జెంటీనాకు ప్రధాని వెళ్తారు.

అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలీతో విస్తృత స్థాయి చర్చలు జరుపుతారు.

రక్షణ, వ్యవసాయం, మైనింగ్, చమురు, గ్యాస్, పునరుత్పాదక శక్తి, వాణిజ్యం, పెట్టుబడులు వంటి కీలక రంగాల్లో ఇండియా-అర్జెంటీనా భాగస్వామ్యాన్ని మరింత మెరుగుపరచడంపై దృష్టి పెడతారు.

ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని విదేశాంగ శాఖ పేర్కొంది.

జులై 5-8: బ్రెజిల్

అర్జెంటీనా పర్యటన ముగిసిన తర్వాత, జూలై 5 నుంచి 8వ తేదీ వరకు బ్రెజిల్‌లో ప్రధాని మోడీ పర్యటిస్తారు.

రియో డి జనీరోలో జరిగే 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొంటారు. ఇది ప్రధానిగా మోడీ నాలుగో బ్రెజిల్ పర్యటన.

సదస్సు సందర్భంగా పలు దేశాధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది.

పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై దృష్టి సారించి, ఉగ్రవాదంపై కఠిన వైఖరిని ఃఖీఎఆ సదస్సులో వినిపించనున్నారు.

డిఫెన్స్, ట్రేడ్, టెక్నాలజీ, ఇంధన సహకారంపై చర్చలు జరుగుతాయి.

2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు భారత్ చేపట్టనున్న నేపథ్యంలో, ప్రస్తుత సదస్సు కీలకమైనది.

బ్రెజిల్‌లో బ్రిక్స్ నాయకుల శిఖరాగ్ర సమావేశం..

అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వా ఆహ్వానం మేరకు మోడీ బ్రెజిల్ పర్యటనలో నాల్గవ, అతి ముఖ్యమైన దశలో భాగంగా పర్యటించనున్నారు. జులై 5 నుంచి 8 వరకు బ్రెజిల్‌లో జరిగే 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి మోడీ హాజరవుతారు. ఆ తర్వాత రాష్ట్ర పర్యటన చేస్తారు. ప్రధానమంత్రిగా మోడీ బ్రెజిల్‌కు ఇది నాల్గవ పర్యటన అవుతుంది. 17వ బ్రిక్స్ నాయకుల శిఖరాగ్ర సమావేశం రియో ??డి జనీరోలో జరుగుతుంది.

జులై 8-9: నమీబియా

ఈ సుదీర్ఘ పర్యటన చివరి దశ నమీబియా.

భారత ప్రధాని నమీబియాలో పర్యటించడం ఇది మూడోసారి.

నమీబియా అధ్యక్షుడు నెతుంబో నంది-నదిత్వాతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు.

నమీబియా పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

గ్రీన్ ఎనర్జీ, వాటర్ టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, భారతదేశ యునైటెడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ అమలు వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి.

ఈ పర్యటన భారతదేశం తన "గ్లోబల్ సౌత్" దేశాలతో సంబంధాలను బలోపేతం చేసుకోవడంతోపాటు కీలకమైన ప్రాంతీయ, అంతర్జాతీయ వేదికలపై తన ప్రభావాన్ని విస్తరించడంలో కీలక పాత్ర పోషించనుంది. రక్షణ, వాణిజ్యం, ఇంధన భద్రత, వ్యూహాత్మక ఖనిజాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు వంటి రంగాల్లో సహకారాన్ని పెంపొందించడంపై ఈ పర్యటన ప్రధానంగా దృష్టి సారించనుంది.

# పరిశ్రమలు మృత్యు కూపాలా..

హైదరాబాద్, జూలై 2

పరిశ్రమల ఏర్పాటుతో రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుంది. అనేక మందికి ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. కానీ అదే సమయంలో పరిశ్రమలు మృత్యువుకు మూలంగా మారుతున్నాయి. అనేక పరిశ్రమల్లో ఇటీవల జరుగుతున్న ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆసియాఖండంలోనే అతి పెద్ద పారిశ్రామిక వాడ అయిన పటాన్ చెరు లో కార్మికులు తరచూ ప్రాణాలు కోల్పోతున్నారు. యాజమాన్యం నిర్లక్ష్య వైఖరితో పాటు ప్రభుత్వ అధికారుల ఉదాసీనత వెరసి కార్మికుల ప్రాణాలు గాలిలో కలసిపోతున్నాయి. ఎన్ని ప్రమాద ఘటనలు జరిగినా తూతూ మంత్రంగా విచారణలు జరపడం, రెండు రోజుల తర్వాత మళ్లీ మామూలే.మామూళ్లకు అలవాటుపడిన ప్రభుత్వ అధికారులు చూసీ



చూడటనట్లు వ్యవహరించడం వల్లనే ఈ దారుణం చోటు చేసుకుంది పటాన్ చెరులోని పాశమైలారం పారిశ్రామిక వాడలో సియాచీ రసాయన పరిశ్రమలో జరిగిన రియాక్టర్ పేలుడులో 35 మంది కార్మికులు మరణించారు. 36 మంది వరకూ తీవ్రగాయాల పాలయ్యారు. మృతుల సంఖ్య 47 వరకూ చేరుకునే అవకాశముంది. పటాన్ చెరు నియోజకవర్గంలో మొత్తం నాలుగు వేల వరకూ పరిశ్రమలున్నాయి. ఇందులో దాదాపు రెండు వేల వరకూ రసాయన పరిశ్రమలే ఉన్నాయి. వీటిని తనిఖీ చేయాలంటే పెద్ద సంఖ్యలో అధికారులు, సిబ్బంది అవసరం. కానీ అరకొర సిబ్బందితో కార్మికుల రక్షణకు సంబంధించిన చర్యలు ఏమీ తీసుకోవడం లేదు. వేల సంఖ్యలో ఉద్యోగులు పని చేస్తున్నా తనిఖీ చేయడానికి పది మంది కూడా లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి... రసాయన పరిశ్రమలో పనిచేయాలంటే అందులో అనుభవం, నిష్ణాతులైన కార్మికులను నియమించుకోవాలి. వారికి శిక్షణ ఇవ్వాలి. కానీ అవేమీ జరగకుండా తక్కువ వేతనానికి వచ్చే ఒడిశా, ఉత్తర్ ప్రదేశ్, బీహార్ రాష్ట్రాల నుంచి కార్మికులను తెప్పించుకుని వారిపై సూపర్ వైజర్ ను నియమించి పని కానిచ్చేస్తున్నారు.పటాన్ చెరు, పాశమైలారం, బొల్లారం, జిన్నారం, గుమ్మడిదల ప్రాంతాల్లో అనేక పరిశ్రమలున్నా తనిఖీలు మాత్రం జరగకపోవడంతో యాజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుంది. సరైన రక్షణ చర్యలు కూడా తీసుకోవడం లేదు.. పరిశ్రమల శాఖ, అగ్నిమాపక శాఖ, కార్మిక శాఖ ఇలా తరచూ తనిఖీలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు లోపాలను పరిశీలించి పరిశ్రమల యాజమాన్యానికినోటీసలు జారీ చేయాలి. కానీ తనిఖీలు చేయకుండానే పరిశ్రమలకు సర్టిఫికేట్లు ఇచ్చేస్తున్నారు. కేవలం ప్రమాదం జరిగినప్పుడు మాత్రమే హడావిడి చేసే అన్ని శాఖల అధికారులు తర్వాత మళ్లీ మామూలు అవుతున్నారు. బాయిలర్లు, రియాక్టర్లు పేలడం సర్వసాధారణంగా మారింది. కెమికల్ ఫ్యాక్టరీలు కావడంతో విషవాయువులు కూడా ప్రమాదకరంగా మారి కార్మికులను బలిగొంటున్నాయి. భద్రతా ప్రమాణాలను పాటించని పరిశ్రమలపై ఇప్పటికైనా చర్యలు తీసుకోకుంటే ఈ మృత్యుఘోష మాత్రం ఆగే అవకాశం లేదు.

ఇంకా ఎంత మంది

సిగాచీ రసాయన పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతుల సంఖ్య 44 మందికి చేరింది. నలభై మూడు మంది ఆచూకీ కనిపించడం లేదు. నిన్న ఉదయం ప్రారంభమయిన రెస్క్యూ పనులు నిరంతరం కొనసాగుతున్నాయి. భవనం పేలుడు ధాటికి కూలి పోవడంతో శిధిలాల కింద ఎక్కువ మంది ఉంటారని, మరో ఇరవై మంది వరకూ ఉంటారని చెబుతున్నారు. కంపెనీ యాజామాన్యం కూడా నలభై మూడు మంది కార్మికుల జాడ కనిపించడం లేదని తెలిపింది. ఇప్పటి వరకూ మరణించినప్పటికీ ఇంకా మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని చెబుతన్నారు. గల్లంతయిన వారు ఇక జీవించే అవకాశం లేదని అక్కడ రెస్క్యూ పనులు చేపట్టిన అధికారులు చెబుతున్నారు. సిగాచీ ఫస్ట్ షిఫ్ట్ లో రియాక్టర్ పేలడంతో కార్మికులు అందులో చిక్కుకుపోయారు. సహాయకచర్యలు వెంటనే ప్రారంభించినా ఫలితం లేకుండా పోయింది. ప్రమాదం జరిగిన సమయంలో మొత్తం 108 మంది కార్మికులు విధుల్లో ఉన్నారు. 32 మంది వరకూ ప్రస్తుతం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఒక్క ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలోనే 35 మృతదేహాలున్నాయి. వీరంతా బీహార్, ఉత్తర్ ప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన వారు అత్యధికంగా ఉన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కు చెందిన వారు తక్కువగానే ఉన్నారు. మృతదేహాలను గుర్తించే పనిలో అధికారులున్నారు. వారి కుటుంబీకులను రప్పించి మృతదేహాలను గుర్తుపట్టే కార్యక్రమాన్ని చేపట్టారు.సిగాచీ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ పదహారుగురు మరణించారు. పేలుడు ధాటికి శరీరంలో ఎనభై శాతం వరకూ గాయాలు కావడంతో చివరకు తుది శ్వాస విడిచారు. మంటలు భారీగా ఎగిసిపడటంతో కొందరికి తీవ్ర గాయాలయ్యాయి. మరికొందరికి భవనాల శిధిలాలు తగిలి గాయాలయ్యాయి. మరికొందరు శిధిలంగా ఉన్న భవనం కింద ఉండవచ్చని భావిస్తున్నారు. ఇంకా శిధిలాల వెలికితీత కార్యక్రమం కొననాగుతుంది. కార్మికులతో పాటు కంపెనీలో పనిచేస్తున్న ఆఫీసర్లు కూడా మరణించారు. సంగారెడ్డిలో మృతుల కుటుంబాల కోసం కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశారు. తమ వారు కనిపించడం లేదంటూ కార్మిక కుటుంబాలు వచ్చి అక్కడ పేర్లు నమోదు చేస్తున్నాయి. ఆ నలభై మూడు మంది ఎక్కడన్నది ఇప్పుడు ప్రశ్నగా మారింది

పరారీలో యాజమాన్యం

పాశమైలారంలోని సిగాచీ రసాయన పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతుల సంఖ్య నలభైకి దాటింది. నలభై మూడు మంది ఆచూకీ కనిపించడం లేదు. అయినా పరిశ్రమ యాజమాన్యం ఇంత వరకూ పరిశ్రమ వద్దకు రాలేదు. ప్రమాదం జరిగి ఇరవై నాలుగు గంటలు గడుస్తున్నా యాజమాన్యం మాత్రం కంపెనీ పరిసర ప్రాంతాల్లోకి రాలేదు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్వం చేశారు. నిన్న ఉదయం ప్రమాదం జరిగి నలభై మంది వరకూ మరణించి, నలభై మూడు మంది వరకూ మిస్ అయితే యాజమాన్యం ఎందుకు రాలేదని నిలదీశారు. కార్మికులు ప్రమాదానికి గురై ఇంత విపత్తు సంభవించినప్పటికీ రాకపోవడానికి కారణాలేంటి అని ప్రశ్నించారు. ప్రస్తుతం సిగాచీ పరిశ్రమలోని ఉన్నతాధికారులతో యాజమాన్యం చర్చలు జరుపుతుంది. కార్మికులకు జీవిత బీమా సౌకర్యం ఉందని చెబుతున్నారు. గాయపడి చికిత్స పొందుతున్న వారి వైద్య ఖర్చులన్నీ ఎవరి అనుమతులు లేకుండానే తాము ఖర్చు చేస్తామని అక్కడ పరిశ్రమకు చెందిన అధికారులు చెబుతున్నారు. యాజమాన్యం పత్తా లేకుండా పోవడానికి గల కారణాలపై చర్చ జరుగుతుంది. ఇంత బీభత్సమైన ఘోరమైన ప్రమాదం జరిగినప్పటికీ తప్పించుకు తిరగడం ఏంటని పలువురు కార్మిక కుటుంబాలు ప్రశ్నిస్తున్నాయి. మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులు వారిపై దాడికి దిగే అవకాశముందని భయపడి ఈ ప్రాంతానికి రాలేదని కుంటి సాకులు చెబుతున్నారు. కానీ ప్రమాదానికి గల కారణాలు తెలుసుకోవడంతో పాటు రియాక్టర్ పేలుడువల్లనే జరిగిందా? లేక మరేదైనా కారణమా? అన్నది తేల్చడానికి కూడా యాజమాన్యం ముందుకు రావాలని కార్మిక కుటుంబాలు డిమాండ్ చేస్తున్నాయి. పరిశ్రమ యాజమాన్యమే ఈ ప్రమాదానికి బాధ్యత వహించాలని ప్రభుత్వం కూడా గట్టిగా చెబుతుంది. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి పరిహారం కూడా పెద్ద స్థాయిలో ఉండేలా చూసేందుకు యాజమాన్యంతో చర్చించాలంటే వారు రాకుంటే ఎలా సాధ్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం మాట్లాడాలంటే ఎవరిని సంప్రదించాలి? అని రేవంత్ రెడ్డి సీరియస్ గానే ప్రశ్నించారు. పరిహారంపై ఎవరు డిసైడ్ చేస్తారంటూ నిలదీశారు. మొత్తం మీద ఇంత మంది ప్రాణాలు పోయినా యాజమాన్యం రాకపోవడం పట్ల నిరసన వ్యక్తమవుతుంది.

# 3 నెలల పాటు సఫారీకి బ్రేక్...

మహబూబ్ నగర్, జూలై 2

ఆలస్యంగా నైనా సరే వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణం ఆహ్లాదంగా ఉంది. వర్షాలు కురుస్తున్నాయి కాబట్టి ప్రకృతి కూడా ఆకుపచ్చ వర్ణాన్ని సంతరించుకుంది. ఇక ఈ సమయంలో కాంక్రీట్ జంగిల్ లాంటి నగరాలను వదిలిపెట్టి.. అడవులను సందర్శిస్తే వచ్చే మజానే వేరు. పైగా నేటి కాలంలో ఆర్థిక స్థిరత్వం పెరిగిన నేపథ్యంలో చాలామంది వీకెండ్స్ లో భిన్నమైన ప్రాంతాలను చూసేందుకు ఇష్టపడుతుంటారు. ఇందులో నాగార్జున సాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ ముందు వరసలో ఉంటుంది. ఈ ప్రాంతం అభయారణ్యం కావడంతో ఇక్కడ జంతువులు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా పులులు కూడా విస్తారంగా ఉంటాయి. ఈ సమయంలో సఫారీ ద్వారా పులులను చూసేందుకు చాలామంది ఇష్టపడుతుంటారు. తమ కెమెరాలలో వ్యాఘ్రాల ఫోటోలను బంధించి సంతోషపడుతుంటారు. అయితే ఇప్పుడు పర్యాటకులు సఫారీ వెళ్లడానికి అవకాశం లేదు.నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ ప్రాంతంలో సఫారీ ఎప్పటినుంచో కొనసాగుతోంది. ఈ సఫారీలో పాల్గొనడానికి ఎక్కడెక్కడ నుంచో పర్యాటకులు వస్తుంటారు. అడవి అందాలను వీక్షిస్తూ మైమరచిపోతుంటారు. జింకల హ్వాయలు .. నెమళ్ల నృత్యాలు.. దుప్పుల గెంతులు.. మనుబోతుల గాంభీర్యం.. పులుల వేట తంత్రం అన్నింటిని చూసి ఆనందిస్తుంటారు.. దీనికోసం ఎన్ని ప్రయాసలైనా పడతారు. ఎన్ని ఇబ్బందులు అయినా ఎదుర్కొంటారు. ఎందుకంటే పచ్చటి అడవి మధ్య ఉంటే ఆ మజా వేరే విధంగా ఉంటుంది. పైగా పచ్చని అడవిలో తిరుగుతుంటే ఒత్తిడి మాయమవుతుంది.అయితే నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ ప్రాంతంలో మరో మూడు నెలల పాటు సఫారీకి అవకాశం ఉండదు. ఎందుకంటే దట్టమైన నల్లమల్ల అడవిలోకి మనుషులు ప్రవేశించే మార్గాలను జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు అటవీశాఖ అధికారులు నిషేధించారు. ఎందుకంటే ఈ మూడు నెలలను వన్యప్రాణుల సంతాన ఉత్పత్తి కాలంగా అధికారులు చెబుతున్నారు. అందువల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. సఫారీ వల్ల అడవిలోకి వెళ్లి జంతువులను ఇబ్బంది పెట్టడం సరికాదని అధికారులు చెబుతున్నారు.." ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి.. అడవులు దట్టమైన పచ్చని రంగును సంతరించుకున్నాయి. ఇలాంటి క్రమంలో జంతువులు సంతానోత్పత్తికి ఆసక్తిని చూపిస్తుంటాయి. ఇలాంటి సమయంలో జంతువులను ఇబ్బంది పెట్టకూడదు. వాటి ఏకాంతాన్ని భగ్నం చేయకూడదు. అందువల్లే మూడు నెలల పాటు టైగర్ రిజర్వ్ ప్రాంతంలో సఫారిని నిషేధించాం. సెప్టెంబర్ 30 తర్వాత సఫారీ పునః ప్రారంభమవుతుంది. అప్పటిదాకా ఈ నిషేధం కొనసాగుతూనే ఉంటుంది. నల్లమల అడవిలోకి మానవ ప్రవేశ మార్గాలను కూడా పూర్తిగా నిషేధించాం. పొరపాటున ఎవరైనా ప్రవేశిస్తే చర్యలు తీసుకుంటామని" అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు.ప్రస్తుతం నల్లమల అడవిలో పుల్లల సంఖ్య గతంతో పోల్చి చూస్తే పెరిగింది. ఇక ఇటీవలి కాలంలో ఇతర ప్రాంతాల నుంచి పులులు ఈ ప్రాంతానికి వస్తున్నాయి. ఇక్కడ జింకలు, దుప్పులు విస్తారంగా ఉ న్నాయి. ఫలితంగా పులులకు కావలసినంత ఆహారం లభిస్తున్నది. నీటి వనరులు కూడా ఉండడంతో పులులు స్వేచ్ఛగా విహరించగలుగుతున్నాయి. పులుల సంతతిని మరింత పెంచడానికి అటవీశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగానే వాటి సంతానోత్పత్తికి అనువైన వాతావరణం ఏర్పాటు చేస్తున్నారు. సఫారీపై మూడు నెలల పాటు నిషేధం విధించడం కూడా ఇందులో భాగమేనని తెలుస్తోంది.

# అంబేడ్కర్ గురుకులం ను పట్టించుకోని డీసీఓ

బద్వేలు పట్టణం లోని మడకలవారిపల్లే అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సరైన భోజనం పెట్టడం లేదు అలాగే సరైన మంచినీరు ఇవ్వడం లేదు సరైన మౌలిక సదుపాయాలు లేవని పరిశీలనకు వెళ్లి మినరల్ వాటర్ మిషన్ గత సంవత్సరం చివర్లో కొత్తది తెచ్చారు.దాదాపు 6 నెలల పైబడి ఆరుబయట సిమెంట్ రోడ్డు మీద ఉంది. అని డీసీఓ గారికి చెబితే ఇంతవరకు కనీసం పాఠశాలను సందర్శించకపోవడం బాధాకరం అని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు పెద్దుళ్ళపల్లి ప్రభాకర్ అన్నారు. ఆయన మాట్లాడుతూ భోజనం సరిగా లేదు. మినరల్ వాటర్ లేవు. మౌలిక సదుపాయాలు లేవు. మినరల్ వాటర్ కేవలం ఉపాధ్యాయులు మాత్రవే వాడుతున్నారు. విద్యార్థులకు ఇవ్వడం లేదు. దానిపైన కూడా ఇంతవరకు పరిశీలన లేకపోవడం దుర్మార్గం. గత సంవత్సరం పనిచేసిన ప్రిన్సిపాల్ ఫర్నీచర్ అమ్ముకున్నది అని ఆరోపణ వస్తే దానిపైన విచారణ లేదు. నాడు నేడు పనుల్లో అవినీతి జరిగిందని ఆరోపణ వస్తె దానిపైన విచారణ లేదు. బాలికల గురుకుల పాఠశాల అవరణ లోపలికి మగవాళ్ళకు పర్మిషన్ లేదు అని గత సంవత్సరం ఉన్న ఒకరో ఇద్దరో ఉపాధ్యాయులను బదిలీ చేశారు. అదే పాఠశాలలో ఏళ్ల తరబడి పని చేస్తున్న రమణ,గురివిరెడ్డి,సుమంత్ లు ఏవిధంగా చేస్తున్నారు. వీళ్ళకి వర్తించవా అని ఆయన అన్నారు. ఈ మధ్యకాలంలో అన్ని ప్రభుత్వ శాఖల్లో బదిలీలు జరిగాయి. అయినా వీళ్లకు ఇద్దరికీ బదిలీలు లేకపోవడం వెనుక ఆంతర్యమేమిటి అని ఆయన ప్రశ్నించారు. మొత్తంగా బద్వేలు గురుకుల పాఠశాల లో ఏ సమస్య వచ్చినా జిల్లా అధికారులు స్పందించి, చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటనీ,ఇక్కడనుండి అధిక మొత్తంలో కమిషన్లు ముట్టడం వల్లనే జిల్లా అధికారులు విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారనీ,జిల్లా అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే ఇక్కడ పనిచేస్తున్న ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది తమదైన శైలిలో విద్యార్థుల ను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన వాపోయారు. విద్యాసంవత్సరం మొదట్లోనే ఇలా ఉంటే ఇక సంవత్సర పొడవునా విద్యార్థులు ఇక్కడ ఉన్న ఉపాధ్యాయులు మరియు సిబ్బందితో ఇంకెన్ని ఇబ్బందులు ఎదుర్కోవాలో అని ఆయన విచారం వ్యక్తం చేశారు. కావున జిల్లా కలెక్టర్ గారు విచారణ చేసి వెంటనే విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత డీసీఓ మరియు పాఠశాల ప్రిన్సిపాల్ మరియు సిబ్బందిపై చర్యలు తీసుకొని, మూడేళ్లపైబడి అక్కడ పనిచేస్తున్న సిబ్బంది నీ వెంటనే బదిలీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# రామచంద్రరావుకు అంత వీజీయే కాదు...

హైదరాబాద్, జూలై 2,

తెలంగాణ బీజేపీ అధ్యక్ష ఎన్నికలు ఎట్టకేలకు నిర్వహించారు. కొత్త సారథిగా మాజీ ఎమ్మెల్యే ఎన్.రామచందర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు మంగళవారం అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, సీనియర్ నాయకులు రామచందర్‌రావును అభినందించారు. శుభాకాంక్షలు తెలిపారు. బీసీ నినాదం వేళ.. ఓసీ నేత తెలంగాణ సారథి కావడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. మరోవైపు కొత్త సారథికి పార్టీలో సరికొత్త సవాళ్లు ఎదురుకాబోతున్నాయి.తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన ఎన్. రామచందర్‌రావు ముందు రాజకీయ సవాళ్లు, అవకాశాలతో కూడిన కీలక బాధ్యత ఉంది. రాష్ట్రంలో మూడు నెలల్లో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో సాధించిన విజయాలను కొనసాగిస్తూ, 2028 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం సాధించాలన్న బీజేపీ అధిష్టానం ఆకాంక్షలను నెరవేర్చాల్సి ఉంది. పార్టీలోని అసంతృప్తులను సమన్వయం చేస్తూ, క్షేత్రస్థాయిలో సంస్థాగత బలోపేతం చేయాల్సి ఉంది.ఎవరు అనువన్నా.. కాదనా?న.. బండి సంజయ్ బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక పార్టీకి గణనీయమైన మైలేజీ వచ్చింది. గణనీయమైన పురోగతి సాధించింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 1 సీటు సాధించిన బీజేపీ, 2023లో 8 అసెంబ్లీ సీట్లు, 2024 లోక్‌సభ ఎన్నికల్లో 8 సీట్లతో 35.08% ఓటు షేర్‌ను సాధించింది. ఈ విజయాలను స్థానిక సంస్థల ఎన్నికలైన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కొనసాగించడం రామచందర్‌రావు ముందున్న తొలి సవాలు. ఈ ఎన్నికలు పార్టీ క్షేత్రస్థాయి బలానికి పరీక్ష. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీ సందేశాన్ని విస్తృతంగా చేరవేయడం కీలకం. వచ్చే ఏడాది జరిగే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గతానికన్నా బలమైన ప్రదర్శన చేయడం రామచందర్‌రావు ఎదుర్కొనే మరో సవాల్.రామచందర్‌రావు నియామకం పార్టీలో కొంత వివాదానికి దారితీసింది. ముఖ్యంగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీకి రాజీనామా చేశారు. ఈటల రాజేందర్, బండి సంజయ్, ధర్మపురి అరవింద్ వంటి నాయకులు అధ్యక్ష పదవికి ఆశించారు. అయితే రామచందర్‌రావును ఎంపిక చేయడం వెనుక అధిష్ఠానం ఆలోచన అతని అనుభవం, ఆర్ఎస్ఎస్‌తో సన్నిహిత సంబంధాలు, వివాదరహిత ఇమేజ్ కీలకంగా ఉన్నాయి. అయితే, రామచందర్‌రావుకు ఇప్పుడు అసంతృప్త నాయకులను కలుపుకొని, వివిధవర్గాల మధ్య సమతుల్యత సాధించడం అతిపెద్ద సవాల్. రాజాసింగ్ వంటి నాయకుల అసంతృప్తిని తగ్గించడం, ఈటల రాజేందర్ వంటి బీఆర్ఎస్ నుంచి వచ్చిన సీనియర్ నాయకులను సమర్థవంతంగా వినియోగించుకోవడం నాయకత్వ నైపుణ్యానికి ఓ పరీక్ష.

రామచందర్‌రావు గతంలో సంఘటన పర్వ సభ్యత్వ డ్రైవ్‌లో కన్వీనర్‌గా పనిచేసి, తెలంగాణలో బీజేపీ సభ్యత్వాన్ని 12 లక్షల నుంచి 40 లక్షలకు పెంచారు. ఈ అనుభవం ఆయనకు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో ఉపయోగపడనుంది. అయితే, రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లతో తీవ్ర పోటీ ఉన్న నేపథ్యంలో, గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ ఆధారాన్ని విస్తరించడం, యువత, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ఓబీసీ మోర్చా, ఏబీవీపీ వంటి విభాగాల ద్వారా ఆకర్షించడం అవసరం. 2028లో తెలంగాణలో అధికారం సాధించాలన్న బీజేపీ అధిష్టానం లక్ష్యం రామచందర్‌రావుపై ఒత్తిడిని పెంచుతుంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ 65 సీట్లతో అధికారంలోకి రాగా, బీఆర్ఎస్ 39 సీట్లతో ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఈ రెండు పార్టీలను ఢీకొట్టి, రాష్ట్రంలో మొదటిసారి అధికారంలోకి రావాలంటే, రామచందర్‌రావు బీఆర్ఎస్, కాంగ్రెస్ ఓటు బ్యాంకులను చీల్చే వ్యూహాలను రూపొందించాలి. ఇందుకోసం, స్థానిక నాయకులను బలోపేతం చేయడం, హిందుత్వ ఎజెండాతోపాటు అభివృద్ధి, సామాజిక న్యాయం వంటి అంశాలను సమతుల్యం చేయడం అవసరం.తెలంగాణలో వచ్చే ఎన్నికల నాటికి బీజేపీ, బీఆర్ఎస్, టీడీపీ కలిసి పోటీ చేసే అవకాశం ఉందని కొంతమంది రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రామచందర్‌రావు నియామకం వెనుక టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది. ఇలాంటి పరిస్థితిలో కుదిరితే పొత్తు పెట్టుకోవడం.. లేదంటే విపక్షాలను చిత్తు చేయాల్సిన ఎత్తులు వేయాల్సిన బాధ్యత రామచందర్‌రావుపై ఉంది. ఈ సమీకరణాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, స్థానిక స్థాయిలో పార్టీ బలాన్ని పెంచడంపై దృష్టి సారించాలి.

# కల్తీ, కృత్రిమ కల్లు ...

నిజామాబాద్, జూలై 2, (

కల్తీ, కృత్రిమ కల్లు తయారీ కోసం వాడే రసాయనాల వ్యాపారం యథేచ్ఛగా సాగుతోంది. ప్రకృతి సిద్ధంగా వచ్చే కల్లును కల్తీ చేయడం, కృత్రిమంగా రసాయనాలతో తయారు చేసి విక్రయిస్తున్నారు. కృత్తిమ కళ్ళు విక్రయించడంతో పేద ప్రజల ప్రాణాలు బేజారుగా మారుతున్నాయి.తాటి, ఈత చెట్ల నుంచి కల్లు అంతగా రాని ప్రస్తుతం గ్రామాల్లో కొందరు కృత్రిమ కల్లును విక్రయిస్తున్నా కూలీలు, పేదలు తాగి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. కృత్రిమ, కల్తీ కల్లు తయారీకి ఉపయోగించే క్లోరల్ హైడ్రేట్, డైజోఫాం వంటి వాటిని పెద్ద ఎత్తున మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి జిల్లాకు తరలించి నిల్వ చేస్తున్నారు. ఈ దందాను అరికట్టాల్సిన అబ్కారీ శాఖ చోద్యం చూస్తుందన్న విమర్శలున్నాయి. మత్తు కోసం డైజోఫాం, క్లోరల్ హైడ్రేట్, క్లోరోఫాం, ఆల్ప్రాజోలం, రుచి కోసం శాక్రిన్ కలుపుతున్నారు.మోతాదుకు మించి రసాయనాలు కలిపి తయారు చేస్తున్న కల్లును తాగుతున్న అమాయక కూలీలు, పేదలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఎప్పటికప్పుడు కల్లు అమ్మకాలపై తనిఖీలు నిర్వహించి పరీక్షలు నిర్వహించాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు ముడుపులు పుచ్చుకుని కిమ్మనడంలేదనే ఆరోపణలున్నాయి. అదేవిధంగా గత రెండు నెలలు క్రితం నస్రుల్లాబాద్ మండలంలో 68 మంది తీవ్ర అస్వస్థకు గురైనప్పటికీ కల్తీకల్లు తయారుచేసిన విక్రయించిన వారిపై కేసులు నమోదు చేసేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు వెనుకడుగు వేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి ఒకరిద్దరిపై కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు ఉన్నాయిబాన్సువాడ ఎక్సైజ్ సీఐ పని తీరుపై తీవ్ర విమర్శలు వెలువడుతున్నాయి ఇష్టం వచ్చినట్లు కళ్ళు దుకాణాలు విక్రయించేందుకు అనుమతులు ఇచ్చి గుత్తి మొక్కలు దారులకు వత్తాసు పలికారు అనే ఆరోపణలు ఉన్నాయి బాన్సువాడ ఎక్సైజ్ శాఖ పరిధిలో అనుమతులు కేవలం కొన్ని కళ్ళు దుకాణాలకు మాత్రమే ఉన్నాయని మిగతా కళ్ళు దుకాణాలు పూర్తిగా అనుమతులు లేకుండా ఎక్సైజ్ సీఐ అనుమతితోనే కొనసాగుతున్నాయని విమర్శలు వెలువెత్తుతున్నాయి ఎక్సైజ్ సీఐ పనితీరుపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకునేలా అధికారులు విచారణ చేపట్టాలని బాధిత కుటుంబాలు డిమాండ్ చేస్తున్నారు. కల్తీకల్లి విక్రాయులపై అక్రమంగా వెలిసిన కళ్ళు దుకాణంలో వెంటనే మూసి వేయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు ఇప్పటికైనా ఎక్సైజ్ సీఐ పై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలు ఉన్నత అధికారులను వేడుకుంటున్నారు.ప్రకృతి సిద్ధమైన తాటి, ఈత చెట్ల నుంచి తీసిన కల్లు ఆరోగ్యకరమైంది. స్వచ్ఛమైన ఈ కల్లును సేవించడం వల్ల కిడ్నీ సంబంధిత సమస్యలు సైతం నయమవుతాయి. డిమాండ్ మేరకు ఉత్పత్తి లేకపోవడం, మద్యం ధరలు ఎక్కువగా ఉ ండటంతో రోజువారీ కూలీలు కృత్రిమంగా లభించే కల్లుకు అలవాటుపడుతున్నారు. ప్రజల్లోని ఈ బలహీనతను కొంత మంది కల్లు వ్యాపారులు సొమ్ము చేసుకుంటారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో క్లోరోహైడ్రేట్, డైజోఫామ్, ఆల్ప్రాజోలమ్ వంటి ప్రమాదకరమైన రసాయణాలను వినియోగించి కల్తీ కల్లును తయారు చేస్తున్నారు. అక్రమ కృత్రిమ కల్లును అరికట్టాలని కోరురా వెలసిన అనుమతులు లేని కళ్ళు కాంపౌండ్లను సీజ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు. కల్తీ కృత్రిమ కళ్ళు తయారిదారులపై విక్రయదారులపై కేసులు నమోదు చేసేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు వెనుకడుగు వేస్తున్నట్లు సమాచారం. ఎక్సైజ్ శాఖ అధికారులు కల్లు విక్రయదారుల తో కుమ్మక్కై మామూల్లో మత్తులో జోగుతూ కేసులో వేసేందుకు ససే మిరా అంటున్నారు. కల్తీ కళ్ళు విక్రయదారులు తయారీదారులు ఎక్సైజ్ శాఖ అధికారులతో అమ్యామ్యలు కొనసాగిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. కేవలం ఒకరిద్దరిపై కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అసలైన సూత్రధారులు పై కేసులు నమోదు చేసి అనుమతులు లేని కళ్ళు దుకాణాలను వెంటనే సీజ్ చేయాలని బాధ్యత కుటుంబాలు డిమాండ్ చేస్తున్నాయి. బాన్సువాడ ఎక్సైజ్ శాఖ పరిధిలోని కళ్ళు దుకాణాలు కల్లు డిపోల ఏర్పాటుకు ఉచ్చలవిడిగా అనుమతులు ఇస్ మామూళ్ల మత్తులో జోగుతున్నారని విమర్శలు తీవ్రంగా ఉన్నాయి అంతే కాకుండా ఒక్కో గ్రామంలో ఒకటి లేదా రెండు కళ్ళు దుకాణాలు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాల్సి ఉన్నప్పటికీ విచ్చలవిడిగా కళ్ళు దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇస్తూ కళ్ళు తయారీదారులతో విక్రయిదారులతో కుమ్మక్కై ప్రజల ప్రాణాలతో చెలగాట మారుతున్నారని ఆరోపణలు కూడా తీవ్రంగా ఉన్నాయి.గతంలో లైసెన్సుల జారీలు రెన్యువల్ లైసెన్సుల జారీలో భారీగానే అమ్యామ్యాలు అందినట్లు విశ్వాసనీయ సమాచారం. బాన్సువాడ ఎక్సైజ్ శాఖ పరిధిలో ఎక్సైజ్ సీఐ పై గతంలో కల్లుమాముల దారులు విక్రయదారులు తీవ్ర విమర్శలు చేసిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా బాన్సువాడ ఎక్సైజ్ శాఖ పరిధిలో అనుమతులు లేని కళ్ళు దుకాణాలను వెంటనే తొలగించాలని ఎక్సైజ్ శాఖ అధికారులు సీఐ పై పూర్తి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలు కోరుతున్నారు.

# రాజాసింగ్... అరవింద్...

## కమలంలో ఏం జరుగుతోంది...

హైదరాబాద్, జూలై 2,

కమలం పార్టీలో ఒక్కసారిగా ముసలం పుట్టింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించి అధిష్టానం తీసుకున్న నిర్ణయం కలవరం కలిగిస్తున్నది. ఎవరూ ఊహించని విధంగా రామచంద్ర రావుకు అధ్యక్ష పదవి కట్టబెట్టడం పార్టీలో ఒక్కసారిగా అసంతృప్తి నెలకొన్నది. ఇప్పటికే గోషామహల్ శాసనసభ సభ్యుడు రాజాసింగ్



భారతీయ జనతా పార్టీకి రాజీనామా చేశారు. అంతేకాదు పార్టీ అధిష్టానం తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ నుంచి తాను వెళ్లిపోతున్నట్టు.. ఇతర రాజకీయ పార్టీలో చేరేది లేదని స్పష్టం చేశారు. రాజాసింగ్ ఉదంతం మర్చిపోకముందే.. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ మరో బాంబు పేల్చారు.తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులో ధర్మపురి అరవింద్ కూడా ఉన్నారు. ఆయన నామినేషన్ కూడా దాఖలు చేసినట్టు తెలుస్తోంది. దీంతో అరవింద్ లేదా ఈటల రాజేందర్ తెలంగాణకు బిజెపి అధ్యక్షుడవుతారని ప్రచారం జరిగింది. కానీ అనూహ్యంగా అధిష్టానం తీసుకున్న నిర్ణయం ఒకసారిగా సంచలనం కలిగించింది. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావును పార్టీ అధిష్టానం ఎంపిక చేయడం కార్యకర్తలనే కాదు నాయకులను సైతం ఆశ్చర్యానికి గురి చేసింది. రామచంద్రరావు ఎంపిక విషయంలో తుది వరకు బిజెపి అధిష్టానం గోప్యత పాటించింది. చివరికి మాజీ ఎమ్మెల్సీ ని నామినేషన్ దాఖలు చేయాలని పార్టీ పెద్దలనుంచి ఆదేశాలు రావడంతో ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. ఎప్పుడైతే అధిష్టానం నుంచి ఆ కబురు వచ్చినట్టు తెలిసిందో.. వెంటనే గోషామహల్ ఎమ్మెల్యే స్పందించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా అధిష్టానం రామచంద్రరావును అధ్యక్షుడిగా ఎంపిక చేయడాన్ని ఆయన తప్పు పట్టారు. వెంటనే తన రాజీనామా లేఖను ప్రస్తుత అధ్యక్షుడు కిషన్ రెడ్డికి అందించారు. ఇదే సమయంలో ఆయన హై కమాండ్ పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.. హై కమాండ్ వైఖరిపై ఆగ్రహంతోనే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్టు రాజాసింగ్ వెల్లడించారు.రాజాసింగ్ ఉదంతాన్ని మర్చిపోకముందే నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ సామాజిక మాధ్యమాలలో కీలక ప్రకటన చేశారు.. వ్యక్తిగత కారణాలవల్ల పార్టీలో జరిగే అధికారిక కార్యక్రమాలకు తాను హాజరు కాలేకపోతున్నానని ప్రకటించారు. ధర్మపురి అరవింద్ ఇటీవల తన నియోజకవర్గంలో పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను పిలిచారు. ఆరోజు కార్యక్రమంలో ధర్మపురి అరవింద్ ఉత్సాహంగా ఉన్నారు. మరుసటి రోజు అధ్యక్షుడిగా రామచంద్రరావును అధిష్టానం ఖరారు చేయడంతో ఆయన ఒక్కసారిగా మనస్థాపానికి గురయ్యారు. పార్టీ కార్యాలయానికి కూడా రాలేదని ఆయన అనుచరులు చెబుతున్నారు. రామచంద్రరావును అధ్యక్షుడిగా నియమించిన మరుసటి రోజు అంటే మంగళవారం నాడు తన సామాజిక మాధ్యమాలలో.. వ్యక్తిగత కారణాలవల్ల పార్టీ కార్యక్రమాలకు ఈరోజు హాజరు కాలేకపోతున్నానని ఒక పోస్ట్ చేశారు.రామచంద్రరావును అధ్యక్షుడిగా ఎంపిక చేయడం ధర్మపురి అరవింద్ కు ఇష్టం లేదని తెలుస్తోంది. అధిష్టానం పై ఆయన ఎటువంటి వ్యాఖ్యలు చేయలేకపోయినప్పటికీ.. తన ఆగ్రహాన్ని ఇలా పరోక్షంగా వ్యక్తం చేశారని తెలుస్తోంది. పార్టీ అధ్యక్ష పదవిపై అరవింద్ చాలా ఆశలు పెట్టుకున్నారు. అయితే హై కమాండ్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడంతో ఆయన అంతర్మథనంలో పడ్డారని తెలుస్తోంది. అందువల్లే పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నట్టు సమాచారం.

# పూర్ణచంద్ చుట్టూనే కథంతా...

అదిలాబాద్, జూలై 2,

పాత్రికేయురాలు స్వేచ్ఛ మరణానికి సంబంధించిన కేసులో రకరకాల విషయాలు వెలుగుచూస్తున్నాయి. స్వేచ్ఛ మరణానికి సంబంధించి ఆమె కూతురు అరణ్య, తండ్రి శంకర్ ఇప్పటికే సంచలన విషయాలు వెల్లడించారు. స్వేచ్ఛ తల్లి శ్రీదేవి కూడా గతంలో తమ కుటుంబంలో చోటు చేసుకున్న విషయాలను కూడా ప్రకటించారు. అవన్నీ కూడా స్వేచ్ఛకు అనుకూలంగా, పూర్ణకు వ్యతిరేకంగా ఉన్నాయి. ఇవి జరుగుతుండగానే పూర్ణ భార్య స్వప్న ఒక్కసారిగా వెలుగులోకి వచ్చారు. ఆమె కూడా కీలక విషయాలు వెల్లడించారు. స్వప్న వెల్లడించిన విషయాలలో పూర్ణ బాధితుడిగా కనిపిస్తున్నాడు. అరణ్య, శంకర్, శ్రీదేవి, స్వప్న.. ఈ నలుగురు కాకుండా స్వేచ్ఛ అంతరంగిక విషయాలు తెలిసినవారు కొందరు ఉన్నారు. అయితే వారు చెబుతున్న విషయాలు ఇప్పుడు సంచలనంగా మారాయి.స్వేచ్ఛను పెళ్లి చేసుకుంటానని పూర్ణ మాట ఇచ్చాడట. అంతేకాదు ఆమె మీద ఒత్తిడి తీసుకొచ్చి భర్త నుంచి విడాకులు తీసుకునే విధంగా చేశాడట. అతడిని నమ్మిన స్వేచ్ఛ అదేవిధంగా విడాకులు ఇచ్చిందట. విడాకులు ఇచ్చిన తర్వాత పెళ్లి చేసుకోవాలని ప్రతిపాదన తీసుకొస్తే పూర్ణ దాటవేసేవాడట. ఇక ఇటీవల కూడా ఆమె అదే ప్రస్తావన తీసుకొస్తే పెళ్లి చేసుకునేది లేదని స్పష్టంగా చెప్పాడట. తనకు పొలిటికల్ గా సపోర్టు ఉందని.. ఆర్థికంగా తాను బలవంతుడిని చెప్పి స్వేచ్ఛను బెదిరించాడట. దీంతో మనస్థాపానికి గురైన స్వేచ్ఛ ఆత్మహత్యకు పాల్పడిందని తెలుస్తోంది.ఇక పోలీసుల విచారణలో పూర్ణ కీలక విషయాలు వెల్లడించినట్టు తెలుస్తోంది. పూర్ణ ప్రస్తుతం రాజ్యసభ మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ దగ్గర చేస్తున్నట్టు వెల్లడించాడు. స్వేచ్ఛతో తనకు ఉన్న బంధం గురించి సంతోష్ కుమార్ కు తెలుసని, మిగతా రాజకీయ నాయకులకు కూడా తెలుసని పూర్ణ చెప్పినట్టు తెలుస్తోంది. మరోవైపు పూర్ణచందర్ గడిచిన 15 సంవత్సరాలుగా స్వేచ్ఛతో కలిసి ఉంటున్నాడని పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. పెళ్లి చేసుకుంటానని చెప్పడంతోనే స్వేచ్ఛ తన భర్తకు విడాకులు ఇచ్చిందని సమాచారం. ఆ తర్వాత పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చిన ప్రతి సందర్భంలోనూ పూర్ణ దాటవేసినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇద్దరు మధ్య విభేదాలు ఏర్పడ్డాయని.. పెళ్లి చేసుకోకుండా తనను సంవత్సరాలకు సంవత్సరాలుగా మోసం చేస్తూ వస్తున్న నేపథ్యంలో స్వేచ్ఛ తీవ్రమైన మానసిక వేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసుల విచారణలో తేలింది.. మరోవైపు స్వేచ్ఛ కూతురు అరణ్యను కూడా పూర్ణ వేధించినట్టు మీడియాలో వార్తలు రావడంతో.. పోలీసులు స్వేచ్ఛ కోతులు స్టేట్మెంట్ కూడా రికార్డ్ చేసుకున్నారు.సరిగ్గా 11 రోజుల క్రితం స్వేచ్ఛ, పూర్ణ అరుణాచలం వెళ్లారు. అక్కడ నుంచి తిరిగి వస్తుండగా స్వేచ్ఛ మరోసారి అతని ఎదుట పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చింది. దీంతో పూర్ణ ఆమెతో వాగ్వాదానికి దిగాడు. అంతేకాదు తన రాజకీయ పలుకుబడి.. ఆర్థికంగా ఉన్న అండదండల వల్ల నన్ను ఏమీ చేయలేవని పూర్ణ స్వేచ్ఛను బెదిరించినట్టు తెలుస్తోంది. దీంతో తనని పెళ్లి చేసుకునే ఉద్దేశం పూర్ణకు లేదని భావించిన స్వేచ్ఛ తీవ్రమైన మనోవేదనకు గురయింది. ఆ తర్వాత మూడు రోజులకే ఆమె తీవ్రమైన ఘాతుకానికి పాల్పడింది. మరోవైపు గడచిన ఎన్నికల్లో పూర్ణచందర్ ఆదిలాబాద్ జిల్లాలోని ఓ నియోజకవర్గం టికెట్ ఆశించినట్టు తెలుస్తోంది.

# విష్ణు కార్స్ కు మరో ప్రతిష్టాత్మక గుర్తింపు

## - రెండు విభాగాల్లో ఉత్తమంగా నిలిచిన విష్ణు గ్రూప్ ఆఫ్ కంపెనీస్




చెన్నై, జూలై 2(భారత శక్తి ప్రతినిధి): లక్షలాది కస్టమర్ల ఆదరణతో కార్ల వ్యాపారంలో నమ్మకానికి మారుపేరుగా నిలిచిన విష్ణు కార్స్ మరో ప్రతిష్టాత్మక పురస్కారాన్ని తన ఖాతాలో వేసుకుంది. చెన్నై జి.ఎస్.టి. శాఖ ప్రకటించిన టాప్ టాక్స్ పేయర్, అత్యుత్తమ పారిశ్రామిక వేత్తల విభాగాల్లో రెండు పురస్కారాలకు ఏక కాలంలో ఎంపికైన సంస్థగా నిలిచింది.

రెండు విభాగాల్లో ఒకే సంస్థ నిలవడం ఇదే తొలిసారి. టాప్ టాక్స్ పేయర్ గా విష్ణు కార్స్, ఉత్తమ మహిళా పారిశ్రామికవేత్తగా విష్ణు గ్రూప్ ఆఫ్ కంపెనీస్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి దీపా వెంకట్ ఎంపికయ్యారు.

8వ సి.జి.ఎస్.టి. దినోత్సవాన్ని పురస్కరించుకుని జి.ఎస్.టి. తమిళనాడు మరియు పుదుచ్చేరి జోన్ చెన్నైలోని కళైవర్ ఆరంగంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీమతి దీపా వెంకట్ ఈ రెండు పురస్కారాలను స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో %జఖవీ×% మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ శ్రీధరన్ రంగరాజన్, ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ డా. రామ్ నివాస్, ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ శ్రీ ఏ.ఆర్.ఎస్. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీమతి దీపా వెంకట్ మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా నమ్మకానికి మారుపేరుగా నిలిచిన విష్ణు కార్స్ ను రెండు విభాగాల్లో సి.జి.ఎస్.టి. వారు గుర్తించడం ఆనందంగా ఉందని తెలిపారు.

కస్టమర్ల ఆదరణ మరియు సంస్థలో సేవలు అందిస్తున్న ఉద్యోగుల నిబద్ధతతోనే ఇది సాధ్యమైందన్న ఆమె, ఈ పురస్కారాలను వారికి అంకితం చేస్తున్నట్లు తెలిపారు. వ్యాపార రంగంలో ఈ పురస్కారాలు తమ బాధ్యతను మరింత పెంచాయన్న ఆమె, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

# డిజిటల్ యుగంలో పోలీసింగ్‌కు కొత్త దిశ జిల్లా ఎస్పీ డా: జి.జానకి షర్మిల.



భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, జులై 2:నిర్మల్ జిల్లా బుధవారం భైంసా లోని క్యాంపు కార్యాలయంలో,నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్‌లకు,నిత్యం పోలీసులు నిర్వహించే బ్లూ కోర్టు, 100 డయల్ స్పందన, ట్రాఫిక్ చలాన్ల జారీ మరియు రాత్రిపూట తిరిగే నేర అనుమానితుల ధృవీకరణ వంటి కార్యక్రమాల్లో మరింత సమర్థవంతంగా ఉపయోగించే సరికొత్త ఆధునికత తో కూడిన ట్యాబ్ లను మరియు కొత్త కెమెరా లను జిల్లా ఎస్పీ డా: జి. జానకి షర్మిల స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..

నేటి యుగంలో సాంకేతిక పరిజ్ఞానం ప్రతి రంగాన్ని ఆధిపత్యంగా మారుస్తోంది. ముఖ్యంగా ప్రజల భద్రతకు నిత్యం పనిచేస్తున్న పోలీస్ విభాగం కూడా ఈ మార్పులకు అనుగుణంగా అభివృద్ధి చెందుతోంది. ఈ ట్యాబ్‌లు అందించడం ద్వారా, విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి అవసరమైన సమాచారాన్ని తక్షణమే పొందే అవకాశం లభిస్తుంది. 100 డయల్ కాల్స్‌కి తక్షణ స్పందన, బాధితుల సమాచార నమోదు, సంఘటన స్థలానికి సమీప పోలీసు బృందాన్ని గుర్తించడం వంటి అనేక కార్యకలాపాలు ఇప్పుడు మరింత వేగవంతంగా, ఖచ్చితంగా నిర్వహించబడతాయి. అంతేకాకుండా బ్లూ కోర్ట్ టీమ్‌లు తమ నియమిత పనులను ట్యాబ్‌ల సహాయంతో రికార్డు చేయడం, సమయానుగుణంగా నివేదికలు పంపడం వంటి అంశాల్లోనూ ఇవి ముఖ్యపాత్ర పోషిస్తాయి.

ఈ చర్య ద్వారా పోలీస్ సేవల్లో పారదర్శకత, సమర్థత పెరగడం తో పాటు, ప్రజలకు మరింత వేగవంతమైన, నిబద్ధతతో కూడిన సేవలందించేందుకు అవకాశం ఏర్పడింది. ఇది పోలీస్ శాఖను డిజిటల్ దిశగా ముందుకు నడిపే చారిత్రక ముందడుగు అని చెప్పవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల తో పాటు ఇన్స్పెక్టర్లు గోపీనాథ్ ,మల్లేష్, ఎస్సైలు అశోక్, మహిళ ఎస్సై పెర్సిస్,అశోక్ ,శ్రీనివాస్,నవనీత్ రెడ్డి,కృష్ణా రెడ్డి, మహిళా ఎస్సై సుప్రియ,హనుమండ్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జహీరాబాద్ పార్లమెంట్ ఇన్చార్జి ఉప్పల శ్రీనివాస్ గుప్తాకి సన్మాన కార్యక్రమం



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జులై 02: జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులై జహీరాబాద్ పార్లమెంట్ ఇన్చార్జిగా ఉన్న ఉప్పల శ్రీనివాస్ గుప్తాకి సన్మాము చేయడం జరిగింది. అనంతరం శ్రీనివాస్ గుప్తా, కైలాస్ శ్రీనివాసరావు, మాట్లాడుతూ,జులై 4న ఎల్బీ స్టేడియంలో నిర్వహించబోతున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల బహిరంగ సభకు, జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే హాజరవుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఆదేశానుసారం నియోజకవర్గంలోని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పార్టీ మండల అధ్యక్షులు మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు.

మాజీ జెడ్పిటీసిలు. ఎంపీటీసీలు,సర్పంచులు సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలందరూ పెద్ద ఎత్తున తరలి వచ్చి ఈ సభను విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పండ్ల రాజు , యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడుగుల శ్రీనివాస్, జిల్లా లీగల్ చైర్మన్ దేవరాజు గౌడ్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పుట్నాల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు కన్నయ్య, రవీందర్ గౌడ్, చాట్ల రాజేశ్వర్, రాజా గౌడ్, బట్టు మోహన్, మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ సిరాజుద్దీన్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మత్, లక్కపత్ని గంగాధర్, పడిహార్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఐ రంజిత్ ను మర్యాద పూర్వకంగా కలిసిన నాయకులు

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)జూలై 02:ఇటీవల సుబేధారి పోలీస్ స్టేషన్ కు నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రంజిత్ కుమార్ ను బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పూల గుచ్చం అందజేసి శాలువ తో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా సీఐ రంజిత్ మాట్లాడుతూ నేరాలను అదుపులో చేందుకు పోలీస్ పెట్రోలింగ్ ను పెంచి నేరాలను అదుపులో ఉంచేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం ఎం ఆర్ పీ ఎస్ ఉద్యమ నాయకులు ఈర్ల కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తు లో మరిన్ని ఉన్నతమైన పదవులు పొందాలని మనస్ఫూర్తిగా కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మాజీ ఏ.జి.పి జన్ను ఆనంద్ కుమార్, న్యాయవాది మహేందర్, ఎంఆర్



పీఎస్ వరంగల్ జిల్లా నాయకులు కొంద్రా రాజు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ లో చేరికలను ఖండించిన

## గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్దప్రోలు మస్తాన్



ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), జూలై 02:మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి కాంగ్రెస్ నుంచి 20 కుటుంబాలు చేరినట్లు బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారాలను బ్రాహ్మణపల్లి గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పెద్దప్రోలు మస్తాన్ తీవ్రంగా ఖండించారు, బుధవారం బ్రాహ్మణపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండించారు,కాంగ్రెస్ పార్టీ నుంచి ఇద్దరు సిపిఐ నుంచి ముగ్గురు మొత్తం ఐదుగురు చేరడం జరిగిందని,కానీ స్థానిక నాయకులు కాంగ్రెస్ నుంచి 20 కుటుంబాలు చేరినట్లు తప్పుగా ప్రచారం చేస్తున్నారని దీనిని బ్రాహ్మణపల్లి కాంగ్రెస్ గ్రామ శాఖ తీవ్రంగా ఖండిస్తున్నమని తప్పుడు ప్రచారాలు మానుకోవాలని పత్రికా ముఖంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ వంగాల రామరావు,గ్రామ కాంగ్రెస్ నాయకులు గంగసాని రాఘవరావు,వంగల వెంకటేశ్వర్లు,పెద్దప్రోలు తిరపతిరావు,వంగాల నాగయ్య,తాటికొండ కిరణ్,జంగం నాగులు,జిడుగు వేంకటేశ్వర్లు ఉన్నారు.

# మహిళా పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్




ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), జూలై 02:పోలీసు స్టేషన్ ఆశ్రయించే మహిళల ఫిర్యాదుల పట్ల తక్షణమే చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులకుఆదేశించారు. బుధవారం మహిళా పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ నిర్వహణ, పెండింగ్‌లో ఉన్న కేసులు, దర్యాప్తు, చార్జిషిట్ రికార్డులు, సీడీ ఫైళ్లను పరిశీలించి అధికారులు పలు సూచనలు చేశారు. ఆనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ..మహిళల భద్రతకు మరింత ప్రాధాన్యత కల్పించాలని, వారు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, వారి రక్షణకై చర్యలు చేపట్టాలని అన్నారు. మహిళల సమస్య పరిష్కారంలో భాగంగా మహిళా పోలీసు స్టేషన్ ఆశ్రయించే మహిళలు, వారు చేసే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. పోలీసు స్టేషన్లకు వచ్చే మహిళలతో మర్యాదగా మాట్లాడాలని, వారు చెప్పే విషయాలను శ్రద్ధగా వినాలని, ఫిర్యాదులవట్ల సానుకూలంగా స్పందించి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా విధిగా కళాశాలలు, పాఠశాలలను, మహిళలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను మహిళా పోలీసు సిబ్బంది సందర్శించి, వారికి రక్షణగా నిలిచే చట్టాలు పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఆపద సమయంలో పోలీసుల సహాయం పొందే విధానం పట్ల అవగాహన కల్పించాలని అన్నారు.

# నిరుపేదలకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), జూలై 02:నిరుపేదలకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మంత్రివర్యులు బుధవారం రఘునాథపాలెం మండలం చిమ్మపూడి గ్రామంలో పర్యటించి ఎస్సీ కాలని నందు 80 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు, 4 కోట్ల 95 లక్షలతో చిమ్మపూడి నుండి పండితాపురం సంత వరకు నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, కోటి 50 లక్షలతో చిమ్మపూడి నుండి మంచుకొండ వరకు నిర్మించనున్న రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ గ్రామంలో గుడిసెల్లో ఉండే నిరుపేదలను మొదటి విడత క్రింద ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, ఎదుగుదలను



నిరంతరం మానిటరింగ్ చేయాలని, పెండింగ్ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. దశల వారీగా ఊరిలో పూరి గుడిసే లేకుండా అర్హులందరికీ ఇండ్లు అందించాలని, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలని అన్నారు. 12 వేల కోట్ల రూపాయలతో సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, 25 వేల కోట్లతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, 9 వేల కోట్ల రైతు భరోసా, 33 కోట్లతో చేనేత రుణమాఫీ చేశామని అన్నారు. గతంలో చిమ్మపూడి గ్రామానికి రోడ్డు లేదని, ప్రస్తుతం అటువంటి మౌళిక వసతుల కల్పన పనులు పూర్తి చేశానని అన్నారు. ప్రజల పిల్లలు చదువుకునేందుకు రఘునాథపాలెం మండలంలో స్వామి నారాయణ స్కూల్, సమీకృత గురుకుల పాఠశాలలు ఏర్పాటు అవుతున్నాయని, విద్య ద్వారానే పేదరికం దూరం అవుతుందని, పిల్లలకు తప్పనిసరిగా చదువు చెప్పించాలని అన్నారు. బుగ్గ వాగు ప్రాజెక్టు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేలా కార్యాచరణ చేపట్టామని అన్నారు. గ్రామాలు పచ్చగా, పరిశుభ్రంగా ఉండాలని, అందరూ సంతోషంగా, ఆనందంగా వుండాలని మంత్రి అన్నారు. సమస్యలు ఒక్కొక్కటిగా అన్నిటినీ పూర్తి చేస్తామన్నారు. పేదలకు, రైతులకు, భవిష్యత్తులో పిల్లలకు ఏం కావాలి ఆలోచించుకొని మంచి కార్యక్రమాలు చేపట్టి, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. కుల, మత, రాజకీయలకతీతంగా అందరూ సామరస్యంగా వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, ఆర్డీఓ నరసింహా రావు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఇఇ పవార్, రఘునాథపాలెం మండల తహసీల్దార్ శ్వేత, ఎంపిడివో అశోక్ కుమార్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భైంసా పట్టణంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఫిర్యాదుల స్వీకరించిన జిల్లా ఎస్పీ డా: జి.జానకి షర్మిల.




భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, జూలై 02: నిర్మల్ జిల్లా బుధవారం భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి భైంసా సబ్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పిర్యాదు దారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. షి టీమ్ సిబ్బంది తో కొన్ని కుటుంబ కలహాల కేసులలో ఇరు పార్టీ వారికి కౌన్సెలింగ్ ఇవ్వటం జరిగింది. ఇలా భైంసా లో షి టీమ్ సిబ్బంది ద్వారా కౌన్సిలింగ్ తో కుటుంబాలు నిలబడుతున్నాయని, మేము నిర్మల్ రావటానికి కష్టంగా ఉండటాన్ని ఎస్పీ గారు అర్థం చేసుకుని భైంసా లో కౌన్సిలింగ్ ఇవ్వటం గురించి పిర్యాదు దారులు చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రీవెన్స్ లో వచ్చిన ఫిర్యాదులను ఇప్పటి వరకు ఎన్ని పరిష్కారం అయ్యాయని మరియు పెండింగ్ పిర్యాదుల పురోగతిని గురించి అధికారులను అడిగి తెలుసు కున్నారు.

# విద్యార్థులతో కలిసి సహ పంక్తి భోజనం చేసిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఎమ్మెల్యే

బి. మఠం, జూలై 2(భారత శక్తి): బి.మఠం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల (బాలురు) తరగతి గదుల ప్రారంభోత్సవం అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీఈజి అశోక్ కుమార్,మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్..సహపంక్తి భోజనం చేస్తూ విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. గురుకుల పాఠశాలలో సరైన సమయానికి టిఫిన్, భోజనం అందజేస్తున్నారా? రుచిగా అందిస్తున్నారా? వారానికి రెండుసార్లు ఇచ్చే చికెన్ తగినంతగా ఇస్తున్నారా లేదా? వసతి గృహంలో బెడ్ షీట్స్ అందించారా లేదా అనే విద్యార్థులను కలెక్టర్ అడగగా విద్యార్థులు మేము అడిగినంతా అన్నం పెడతారని, కూరలు రుచికరంగా ఉంటాయని, బెడ్ షీట్స్



అందించారని ఎటువంటి ఇబ్బందులు లేవని తెలిపారు. వీరేష్ అనే విద్యార్థి కలెక్టర్ తో మాట్లాడుతూ. మాది కర్నూలు జిల్లా కోడుమూరు మండలం కృష్ణాపురం గ్రామమని మా తల్లిదండ్రులు ఇటుక పనికి వెళ్తారని,తాను 9వ తరగతి చదువు తున్నానని, పెద్దయ్యాక మాథ్స్ టీచర్ అవుతానని కలెక్టర్ కి తెలుపగా కలెక్టర్ సంతోషం వ్యక్తం చేస్తూ బాగా చదువుకొని నువ్వు అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు.

# బీరకాయ తింటే.. ఇమ్యూనిటీ పెరగడంతో పాటు, గుండెకు కూడా మంచిదే..!

వేసవి కాలంలో మార్కెట్లో ఎక్కువగా దొరికే, మనం తరచుగా వండుకునే కూరల్లో బీర ఒకటి. బాలింతలకు, సర్జరీ అయినవారికి, అనారోగ్యం ఉన్నవారికి పథ్యంలోనూ బీరకాయనే పెడతారు. బీరకాయలో కొవ్వులు తక్కువగా, నీరు, ఫైబర్ ఎక్కువగా ఉండి, పోషకాలు అధికంగా ఉండడంతో పాటు తొందరగా జీర్ణం కావడమే అందుకు కారణం. బీరకాయలో విటమిన్ ఎ, విటమిన్ సి, ఐరన్, మెగ్నీషియం, విటమిన్ బి6, పొటాషియం, సోడియం, జింక్, కాపర్, థ్కమీన్ వంటి పోషకాలు ఉంటాయి. ఈ పోషకాలు మన ఆరోగ్యానికి మేలు చేస్తాయి. బీరకాయ మన డైట్‌లో చేర్చుకుంటే ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయో ఈ స్టోరీలో చూద్దాం.



బీరకాయలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇది తరచుగా తీసుకుంటే ఐరన్ లోపం కారణం వచ్చే రక్తహీనత సమస్య నయం అవుతుంది. బీరకాయలో విటమిన్ %దీ%6 పుష్కలంగా ఉంటుంది, ఇది ఐరన్‌తో పాటు శరీరంలోని ఎర్ర రక్తకణాల సరైన సంశ్లేషణలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది శరీరంలోని అన్ని అవయవాలకు రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. నొప్పి, అలసట వంటి లక్షణాలను తగ్గిస్తుంది.

బీరకాయలో నీరు పుష్కలంగా ఉంటుంది. అదనంగా, దీనిలో గుజ్జులో సెల్యులోజ్, డైటర్ ఫైబర్ మెండుగా ఉంటుంది. ఇది పేగుల కదలికను, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకంతో బాధపడేవారు వారి డైట్ బీరకాయ తీసుకుంటే ఈ సమస్య దూరం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. మలబద్ధకంతో బాధపడేవారు ఒక గ్లాస్ బీరకాయ రసంలో తేనె కలిపి తాగితే.. మలబద్ధకం సమస్య నుంచి తక్షణమే ఉపశమనం లభిస్తుంది. సెల్యులోజ్ ఎక్కువగా ఉండటంతో ఇది మలబద్ధకాన్నీ మొలలవ్యాధినీ నివారిస్తుంది.

బీరకాయ శరీరంలోని వ్యర్థాలు, ఆల్కహాల్ అవశేషాలు, జీర్ణం కాని ఆహార కణాలను శరీరం నుంచి తొలగించి, రక్తాన్ని శుద్ధి చేస్తుంది. దీంతో లివర్ ఆరోగాన్ని, పిత్త పనితీరును పెంపొందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. లివర్ బైల్ రసాన్ని విడుదల చేస్తుంది. ఇది లిపిడ్లు, కొవ్వులను విచ్ఛిన్నం చేయడంలో సహాయపడుతుంది. బీరకాయ ఇది హెపాటిక్ నాళంలో తలెత్తే కామెర్లు, ఇతర ఇన్ఫెక్షన్లను నయం చేయడానికి ఔషధంలా పనిచేస్తుంది.

బీరకాయలో విటమిన్ సి, ఐరన్, మెగ్నీషియం, రైబోఫ్లావిన్, థయామిన్, జింక్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక వ్యవస్థను మెరుగువరుస్తాయి. శరీలంలో ఇన్ఫ్లమేషన్‌ను తగ్గించడంలో సహాయపడతాయి.

బీరకాయలో పొటాషియం, మెగ్నీషియం మెండుగా ఉంటాయి. ఇవి హృదయనాళ వ్యవస్థ పనితీరులో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ మినరల్స్ శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లుగా పనిచేస్తాయి, ఇవి ఫ్రీరాడికల్స్‌తో పోరాడి గుండె కణాలు నష్టపోకుండా రక్షిస్తాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. దీనిలోని విటమిన్ బి5 చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది.?

బీరకాయలో నీరు అధికంగా ఉంటుంది. ఇది విశేషమైన శీతలీకరణ ప్రభావాలను అందిస్తుంది, శరీర వేడిని తగ్గిస్తుంది. దీనిలో పొటాషియం, సోడియం, జింక్, రాగి, సెలీనియం వంటి ఖనిజాలు.. శరీరంలో మిగులు యాసిడ్స్‌ను తటస్తం చేస్తాయి, ఆల్కలీన్ వాతావరణాన్ని ఉత్పత్తి చేస్తాయి, ఎలక్ట్రోలైట్ సమతుల్యతను పునరుద్ధరించడంలో సహాయపడతాయి. ఈ మినరల్స్ కోల్పోయిన ద్రవాలు, వ్యవస్థలోని పోషకాలను తిరిగి నింపుతాయి.


అల్సర్లతో బాధపడేవారికి బీరకాయ ఔషధంలా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. దీనిలో యాంటీ ఇన్ఫ్లమేటరీ, కూలింగ్ ఏజెంట్స్ ఉంటాయి. ఇది పెప్టిక్ అల్సర్ల నుంచి ఉపశమనం ఇవ్వడానికి సహాయపడుతుంది. కడుపులో, మూత్రవిసర్జన సమయంలో మంటను తగ్గించడానికి బీరకాయ సహాయపడుతుంది.

బీరకాయల్లోని పెప్టైడ్‌లు, ఆల్కలాయిడ్‌లు రక్తంలోనూ మూత్రంలోనూ ఉండే చక్కెర నిల్వల శాతాన్ని తగ్గించేందుకూ తోడ్పడతాయి. దీనిలోని మాంగనీస్ జీర్ణక్రియా ఎంజైములు ఉత్పత్తిని పెంచి.. రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది.

బీరకాయలోని విటమిన్ ఎ కంటికండరాల బలహీనత కారణంగా తలెత్తే అంధత్వాన్ని నివారిస్తుందని జాతీయ అంధత్వ నివారణ సంస్థ పేర్కొంది. బీరకాయలోని మాక్యులార్ డీజెనరేషన్, పాక్షిక అంధత్వం, ఇతర కంటి వ్యాధులను నివారించడంలో కూడా సహాయపడతాయి.

# ఈ గింజలు రోజూ ఒక స్పూన్ తింటే.. పీసీఓఎస్ లక్షణాలు తగ్గుతాయ్..!

ప్రస్తుతం చాలా మంది మహిళలు పీసీఓఎస్‌తో బాధపడుతున్నారు. పీసీఓస్ కారణంగా బరువు పెరగడం, విపరీతంగా జుట్టు రాలిపోవడం, మూడ్ స్వింగ్స్, ఒత్తిడి వంటి సమస్యలు ఎదురవుతాయి. వీటిని పరిష్కరించడానికి గుమ్మడి గింజలు సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. ?






ఈ మధ్యకాలంలో మహిళల్లో పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (%భాజూూ%) సర్వసాధారణంగా మారింది. ఓ నివేదిక ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 6-26 శాతం మహిళలు వీసీఓఎస్‌తో ఇబ్బంది పడుతున్నారు. మన దేశంలో దేశంలో ప్రతి ఐదుగురు మహిళల్లో ఒకరికి పీసీఓఎస్ ఉంటుందని నిపుణుల అంటున్నారు. పీసీఓఎస్ ఉన్న మహిళల్లో అసాధారణ స్థాయిలో ఆండ్రోజన్స్ ఉత్పత్తవుతుంటాయి. ఇవి అండాశయాలపై చిన్న చిన్న సిస్టుల్లాగా కనిపిస్తాయి. . పీసీఓఎస్ కారణంగా.. బరువు పెరగడం, మూడ్ స్వింగ్స్, ఒత్తిడి, ఆందోళనలు, విపరీతంగా జుట్టు రాలిపోవడం, నెలసరి క్రమం తప్పడం వంటి సమస్యలు ఎదురవుతాయి. %భాజూూ% ఉన్న వ్యక్తులు వారి డైట్‌లో గుమ్మడి గింజలు చేర్చుకుంటే.. పీసీఓఎస్ లక్షణాల నుంచి ఉపశమనం పొందవచ్చని క్లినికల్ అధయ్యానాలు సూచిస్తున్నాయి.?

గుమ్మడి గింజల్లో ఫైబర్, విటమిన్ ఏ, బీ, సీ ఈ తో పాటు జింక్, అమైనో యాసిడ్స్ , ఐరన్, కాల్షియం, జింక్, ఫోలేట్ , ఫ్యాటీ యాసిడ్స్, ఫాస్ఫరస్, పొటాషియం, ఫినోలిక్ సమ్మేళనాలు పుష్కలంగా ఉంటాయి.

పీసీఓఎస్ కారణంగా.. కొంతమంది మహిళలు విపరీతంగా బరువు పెరుగుతారు. బరువును కంట్రోల్‌లో ఉంచుకోవడానికి రోజుకు ఓ స్పూన్ గుమ్మడి గింజలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. గుమ్మడి విత్తనాలను కొన్ని తీసుకున్నా.. పొట్ట నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ శక్తి అందినట్లు అనిపిస్తుంది. ఎందుకంటే వీటిలో ప్రొటీన్లు, అధిక కెలోరీలు ఉంటాయి. గుమ్మడి గింజల్లోని ఫైబర్ జీర్ణశక్తిని మెరుగుపరిచి వ్యర్థాలను బయటకు పంపుతుంది. దీంతో బరువు కంట్రోల్‌లో ఉంటుంది.

పీసీఓఎస్ ఉన్నవారికి ఎక్కువగా ఎదురయ్యే సమస్య హెయిర్ ఫాల్. గుమ్మడి విత్తనాలు హెయిర్ ఫాల్‌ను కంట్రోల్ చేస్తాయి. వీటిలోని కుకుర్‌బిటాసిన్, అమినోయాసిడ్ జుట్టును ఆరోగ్యంగా ఉంచుతాయి. వీటిలోని వీటిమిన్ ఇ, కెరోటినాయిడ్స్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు జుట్టు ఎదుగుదలకు తోడ్పడతాయి. గుమ్మడి గింజల్లోని ఏ, బీ, సీ విటమిన్లు, సెలినియం, మెగ్నీషియం, ఐరన్, క్యాల్షియం, కాపర్, జుట్టు కుదుళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి.

పీసీఓఎస్ పేషెంట్స్ ఒత్తిడి, ఆందోళన, మూడ్ స్వింగ్స్‌తో బాధపడుతూ ఉంటారు. గుమ్మడి గింజలు ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడతాయి. గింజల్లోని సెరటోనిన్ అనే పదార్థం యాంటీ డిప్రెసెంట్‌గా పని చేస్తుంది. ఈ గింజలో ట్రిప్టోఫాన్ అనే మూలకం ఉంటుందని, ఇది డిప్రెషన్‌ను తగ్గిస్తుంది. మీ స్ట్రెస్‌ను తగ్గించి.. మానసికంగా ప్రశాంతంగా ఉంచుతాయి.

# సపోటా తింటే.. అందం, ఆరోగ్యం మీ సొంతం..!

పండ్లు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ముఖ్యంగా సీజనల్ ఫ్రూట్స్ మన డైట్‌లో కచ్చితంగా చేర్చుకోవాలని నిపుణులు సూచిస్తూ ఉంటారు. సమ్మర్‌లో మామిడి తర్వాత మనం ఎక్కువగా ఇష్టపడి తినే పండ్లలో సపోటా ఒకటి. దీని తియ్యటి గుజ్జు నోట్లో వేసుకోగానే కరిగిపోతుంది.. సపోటతో చేసే మిల్క్ షేక్స్, ఐస్ క్రీమ్స్, జ్యూస్‌లు ఎంజాయ్ చేస్తూ ఉంటారు. సపోటా టేస్టేలోనే కాదు పోషకాలలోనూ



అద్భుతః అంటున్నారు నిపుణులు. సపోటాలో ఐరన్, పోటాషియం, కాపర్, క్యాల్షియం, మెగ్నీషియం, జింక్, ఫాస్ఫరస్ వంటి మినరల్స్, విటమిన ఏ, బి, సి, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఈ పండులో ఆస్ట్రింజెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ వైరల్, యాంటీ బాక్టీరియల్, యాంటీ పారాసైడ్ లక్షణాలతో కూడిన పాలీఫెనాల్ సమ్మేళనం టానిన్ సమృద్ధిగా ఉంటుంది. సపోటా పండును మన డైట్‌లో చేర్చుకుంటే ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయో ఈ స్టోరీలో చూద్దాం.

సపోటాలో కాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్ పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇవి మీ ఎముకలను దృఢంగా ఉంచుతాయి, ఆస్టియోపోరోసిస్ ముప్పును తగ్గిస్తాయి.

సపోటాలో విటమిన్ సి, కాపర్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి. ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. ఈ పోషకాలు శరీరంపై ఫ్రీ రాడికల్స్ ప్రభావానికి వ్యతిరేకంగా పోరాడతాయి. మీరు జలుబు, ఇన్ఫెక్షన్లతో బాధపడుతుంటే.. సపోటా తింటే.. నాసికా మార్గం, శ్వాసకోశం క్లియర్ అవుతుంది.?

సపోటా హైపర్‌టెన్షన్‌ను కంట్రోల్ ఉంటుతుంది. ఈ పండులో సమృద్ధిగా ఉండే పొటాషియం, మెగ్నీషియం.. సోడియం స్థాయిలు తగ్గిస్తాయి. రక్త ప్రసరణను ప్రోత్సహించి, మీ బ్లడ్ ప్రెజర్ స్థాయిలను మెయింటేన్ చేస్తాయి. ఇది స్ట్రోక్, గుండెపోటు వంటి గుండె సంబంధిత సమస్యల ముప్పును తగ్గిస్తాయి. పొటాషియం మూత్రం ద్వారా శరీరం సోడియంను తొలగిస్తుంది. ఇది హైపర్‌టెన్షన్ కంట్రోల్‌లో ఉంచడానికి తోడ్పడుతుంది. సపోటాలో ఐరన్ కూడా పుష్కలంగా ఉంటుంది, ఇది రక్తహీనతను దూరం చేస్తుంది.

సపోటాలో యాంటీ ఆక్సిడెంట్లు నిండి ఉంటాయి. ఇవి చాలా రకాల క్యాన్సర్ల నుంచి రక్షిస్తాయి. సపోటాలోని విటమిన్ ఏ, బి శరీరంలోని శ్లేష్మ పొరలను నిర్వహించడానికి సహాయపడతాయి. ఇది నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రమాదాన్ని నివారిస్తుంది. సపోటాలో డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది ప్రేగు కదలికలను నియంత్రించడంలో సహాయపడుతుంది. పెద్దప్రేగు క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని నివారిస్తుంది.

అధిక మొత్తంలో కెలొరీలుండే ఈ పండు తక్షణ శక్తిని అందిస్తుంది. జీర్ణక్రియ సక్రమంగా సాగేలా చూస్తుంది. ఈ పండులో విటమిన్ ఎ మెండుగా ఉంటుంది. దీన్ని తీసుకుంటే కంటి ఆరోగ్యానికి మంచిది.

సపోటా ఆరోగ్యకరమైన, మెరిసే చర్మానికి సహాయపడుతుంది. సపోటాలోని విటమిన్ ఇ మీ చర్మానికి తేమనందిస్తుంది. మెరిసే చర్మాన్ని అందిస్తుంది. దీనిలో యాంటీఆక్సిడెంట్లు మెండుగా ఉంటాయి. ఇది చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షించి యాంటీ ఏజింగ్ కాంపౌండ్‌గా పనిచేస్తుంది. వృద్ధాప్య ఛాయలు త్వరగా రాకుండా అడ్డుకుంటుంది.

# వారం రోజుల్లో బరువు తగ్గించే.. బెస్ట్ డ్రింక్స్ ఇవే..!

: ఈ రోజుల్లో ఎక్కువమంది ఎదుర్కొంటున్న సమస్య.. అధిక బరువు. నిశ్చలజీవన శైలి, చెడు ఆహార అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, ఒత్తిడి, నిద్రలేమి కారణంగా చాలా మంది అధిక బరువుతో ఇబ్బంది పడుతున్నారు. అధిక బరువు వల్ల అందవిహీనంగా కనిపించడమే కాదు.. అరోగ్య సమస్యల ముప్పు కూడా పెరుగుతుంది. ఊబకాయం కారణంగా డయాబెటిస్, హైపర్‌టెన్షన్, గుండె సమస్యలు, స్ట్రోక్, పెద్దప్రేగు క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధుల ముప్పు పెరుగుతుంది. అందుకే, బరువును కంట్రోల్‌లో ఉంచుకోవడం చాలా ముఖ్యం. బరువు తగ్గడం సుదీర్ఘమైన పని అని చాలా మంది అనుకుంటారు. ఆయుర్వేదం ప్రకారం కొన్ని జాగ్రత్తలతో వారం రోజులో ఆరోగ్యంగా బరువు తగ్గవచ్చని నిపుణులు అంటున్నారు.





ఒక వారంలో కూడా బరువు తగ్గవచ్చని నిపుణులు అంటున్నారు. దీన్ని చాలా సమతుల్య పద్ధతిలో చేయాలి. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ ప్రకారం, వారం రోజుల్లో 0.45%--%1.36 కిలోల బరువును తగ్గొచ్చు. సగటున, శరీర బరువులో 1 శాతం కోల్పోవడం ఆరోగ్యకరమైనది.

త్రిఫల బరువు తగ్గించడానికి, బెల్లీ ఫ్యాట్ కరిగించడానికి సహాయపడుతుందని ధరిషా ఆయుర్వేద వ్యవస్థాపకుడు, ఆయుర్వేద నిపుణుడు రాజిందర్ ధమిజా అన్నారు. రాత్రి పడుకునే ముందు ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో త్రిఫల చూర్ణం కలిపి తీసుకుంటే బెల్లీ ఫ్యాట్ త్వరగా కరుగుతుంది. ఇది పొట్టను శుభ్రపరచడంతో పాటు, బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఉదయం పూట ఖాళీ కడుపుతో ఇది తాగినా మంచి రిజల్ట్స్ ఉంటాయి.

బరువు తగ్గాలనుకునే వారికి అల్లం టీ బెస్ట్ ఆప్షన్. అల్లం జీవక్రియ, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కడుపు ఉబ్బరం, ఆహారం జీర్ణం కాకపోవటం వంటి సమస్యలనూ దూరం చేస్తుంది. రోజూ అల్లం టీ తాగితే.. బెల్లీ ఫ్యాట్ సులభంగా కరుగుతుందని, శరీరం డిటాక్స్ అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఉదయం లేవగానే నీటిలో అల్లం వేసి మరిగించాలి. ఈ నీళ్లను వడగట్టి తేనె, పుదీనా ఆకులు వేసుకుని తాగండి.

ఉదయం పూట గోరువెచ్చని నీటిలో నిమ్మరసం వేసుకుని తాగే అలవాటు చాలామందికి ఉంటుంది. ఉదయం పూట నిమ్మరసం వేసిన నీళ్లు తాగితే జీవక్రియ మెరుగుపడుతుంది. నిమ్మరసంలో ఉండే.. సిట్రిక్ యాసిడ్ కొవ్వును విచ్ఛిన్నం చేస్తుంది. నిమ్మలోని విటమిన్ సి సీజనల్ వ్యాధుల నుంచి రక్షిస్తుంది. శరీరంలోని వ్యర్థాలనూ బయటకు పంపేస్తుంది.

గ్లాసు గోరువెచ్చని నీటికి అరచెక్క నిమ్మ రసం, రెండు స్పూన్ల ఆపిల్ సిడార్ వెనిగర్, చెంచా తేనె కలిపి తీసుకోండి. ఈ వెనిగర్‌లోని ఎసిటిక్ యాసిడ్ శరీరంలో పేరుకున్న కొవ్వును కరిగించి బరువు తగ్గడంలో సాయపడుతుంది. రక్తంలో చక్కెర స్థాయులను తగ్గించి, తీపి పదార్థాలపై మనసు మళ్లకుండా చూస్తుంది.

గ్లాసు గోరువెచ్చని నీటిలో పావు స్పూను పసుపు, చెంచా తేనె వేసుకొని తాగండి. పసుపులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. తేనె చర్మ ఆరోగ్యాన్ని సంరక్షిస్తుంది. ఇన్ఫెక్షన్ల నుంచీ కాపాడుతుంది. పసుపులోని గుణాలు శరీరంలో పేరుకున్న కొవ్వును కరిగిస్తాయి.



Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Published & Printed at Sri Muktheswara Publications.,
D.No. 4-31-2, Balaji Nagar, Kurnool - 518006, Andhra Pradesh. Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com,APTEL/2013/50559, Editor: Kesaram Penta Reddy